
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY అన్నమయ్య జిల్లా వార్తలు
5
గురువారం 6 నవంబరు 2025


రాజంపేట శివాలయంలో కార్తీక దీపారాధన చేస్తున్న మహిళా భక్తులు

అందరికీ మెరుగైన వైద్యమే లక్ష్యం

● కలెక్టర్ నిశాంత్‌కుమార్


నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్, రూపానందరెడ్డి

చిట్వేలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అందరికీ ఆధునిక సౌకర్యాలతో కూడిన మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. బుధవారం చిట్వేలిలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రి భవన సముదాయాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల అవసరాన్ని ఉంచుకుని నూతన భవనంలో ఆధునిక సౌకర్యాలతో కూడిన ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఎమ్మెల్యే శ్రీధర్, ఇన్‌చార్జ్ రూపానందరెడ్డిలు మాట్లాడుతూ చిట్వేలిలో మెరుగైన వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో అన్ని వసతులు ఆసుపత్రుల్లో ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ జయప్రకాశ్, తహసీల్దారు స్పందనరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు, సీఐ వెంకటేశ్వర్లు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శేఖర్, ముక్కా సాయివికాస్‌రెడ్డి, సర్పంచ్ దండు లక్ష్మీ, గుత్తి నరసింహ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వరలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.


వాల్మీకిపురంలో దీపాల కాంతులతో పట్టాభిరాముడి మహా గరుడ పుష్కరిణి


చిట్వేలిలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు


వీరభద్రాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు


పాతరాయచోటిలోని శివాలయంలో ఏకాంబరేశ్వరి అలంకారంలో అగస్త్యేశ్వరుడు


వాల్మీకిపురంలో జ్వాలా తోరణ దర్శనం


పీలేరు శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు


మదనపల్లెలో ప్రత్యేక అలంకారంలో నీలకంఠేశ్వరస్వామి

శివోహం...

● కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయాలు కిటకిట
● భక్తిశ్రద్ధలతో కార్తీక దీపోత్సవం
● శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు

పీలేరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం జిల్లావ్యాప్తంగా శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు తరలివెళ్ల కార్తీక దీపాలు వెలిగించారు. పీలేరు పట్టణంలోని కాశీవిశ్వేశ్వర స్వామి, రౌద్రాల అంకాళమ్మ, చెన్నకేశవ స్వామి, పద్మావతి ఆండాళ్ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రాయచోటి పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో బుధవారం కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో గల అఘోర లింగేశ్వరుడి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అలాగే పాతరాయచోటిలో గల ప్రాచీన అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ఈశ్వరుడు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. పట్టణ భక్తులతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి కార్తీక దీపాలు వెలిగించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. వాల్మీకిపురంలో బుధవారం కార్తీక పౌర్ణమి వేడుకలు విశేష భక్తజనం నడుమ కనుల పండువగా సాగాయి. స్థానిక కోనేటివీధిలోని లక్ష్మీకామేశ్వరస్వామి ఆలయంలో ఉదయం మూలవర్లకు అభిషేకాలు, విశేషాలంకరణలతో ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం ఆలయంలో జ్వాలా తోరణం, ద్వారదర్శనం, ఆయుధ దీపోత్సవం నిర్వహించి అశేష భక్తజనం కార్తీక దీపాలను వెలిగించారు. రాజంపేట పట్టణంలోని పలు శివాలయాల్లో మహిళలు కార్తీక దీపాలను వెలిగించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. రైల్వేకోడూరు పట్టణంలోని భుజంగేశ్వరస్వామి ఆలయంలో ఆది శంకరుడికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే మహిళలు భారీ సంఖ్యలో ఆలయానికి వచ్చి కార్తీక దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. కలికిరి సోమేశ్వరస్వామి ఆలయంలో సహస్ర దీపారాధనలతో ఆలయం వెలుగులు సంతరించుకుంది. ప్రధానంగా మహిళా భక్తులు పోటెత్తడంతో ఆలయం కిక్కిరిసిపోయింది. మదనపల్లెలోని నీరుగట్టువారిపల్లెలో గల నీలకంఠేశ్వరస్వామి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుంచే ఆలయానికి పెద్దఎత్తున భక్తులు చేరుకుని కార్తీక దీపాలు వెలిగించారు.

వైభవంగా సీతారాముల పౌర్ణమి కల్యాణం


స్వామి వారికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతి నెలా పౌర్ణమి రోజున ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తారు. అందులో భాగంగా బుధవారం కార్తీక పౌర్ణమి కావడంతో స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వేకువజామునే మూలవిరాట్‌లకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణవేదికపై ఆశీనులు చేసి అర్చకులు వీణా రాఘవాచార్యులు, మనోజ్‌కుమార్‌లు వేదమంత్రోచ్చారణల మధ్య కల్యాణ తంతును ప్రారంభించారు. అనంతరం మాంగల్యధారణ కార్యక్రమం నిర్వహించారు. కార్తీక పౌర్ణ మి కావడంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి స్వామివారి కల్యాణాన్ని వీక్షించారు. కల్యాణం సందర్భంగా చిన్నారులు నిర్వహించిన కూచిపూడి నృత్యం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

ఢిల్లీకి ఇద్దరు విద్యార్థులు

● సైన్స్ ఎక్స్‌పోజర్ టూర్‌కు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో సుబ్రహ్మణ్యం, తదితరులు

రాయచోటిటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు జరగనున్న సైన్స్ ఎక్స్‌పోజర్ టూర్‌లో భాగంగా అన్నమయ్య జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ఢిల్లీకి వెళ్లారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాశాఖ, సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (స్కాప్) సహకారంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సైన్స్ ఎక్స్‌పోజర్ ఎడ్యుకేషనల్ టూర్‌ను నిర్వహిస్తున్నట్లు డీఈవో సుబ్రహ్మణ్యం తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకతలను పెంపొందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 6 నుంచి 8వ తేది వరకు 3 రోజుల పాటు ఢిల్లీలో ఈ టూర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో జిల్లా నుంచి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థుల చొప్పున మొత్తం 52 మంది విద్యార్థులకు టూర్‌కు అవకాశం కల్పించారన్నారు. ఇందులో అన్నమయ్య జిల్లా నుంచి సంబేపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తరుణ్‌కుమార్‌గౌడ్, సంబేపల్లె మోడల్ స్కూల్‌కు చెందిన యశ్వంత్‌కుమార్‌రెడ్డిలు టూర్‌కు ఎంపికయ్యారన్నారు. వీరు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో వివిధ పోటీల్లో పాల్గొనడం వల్ల సమగ్ర శిక్ష వీరిని ఎంపిక చేసిందని తెలిపారు. ఈ విద్యార్థులకు నాసా ఇంజనీర్లు, స్టెమ్ అధ్యాపకులతో పరస్పర చర్యలు, వర్క్‌షాపులు ఉంటాయన్నారు. వీరికి రష్యన్ సెంటర్ ఆఫ్ సైన్స్ అండ్ కల్చర్, నేషనల్ సైన్స్ మ్యూజియం, నెహ్రూ ప్లానిటోరియం వంటి ప్రసిద్ధ సైన్స్ సంస్థలను సందర్శింపజేస్తారని తెలిపారు. విద్యార్థులను జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, అడిషనల్ డైరెక్టర్ రవికుమార్, ప్రధానోపాధ్యాయుడు సుంకర రామకృష్ణ, ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, అసిస్టెంట్ ఏఎంవో అసదుల్లా, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కో-ఆర్డినేటర్ వీరాంజనేయులు తదితరులు అభినందించారు.

రూ.300 కోట్లతో జల్‌జీవన్ మిషన్ ద్వారా తాగునీరు

● 11, 12న సీఎంతో శంకుస్థాపన ● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జల్ జీవన్ మిషన్ పథకం కింద నియోజకవర్గం లోని 6 మండలాలకు రూ.300 కోట్లతో తాగునీటిని అందిస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని కస్తూరిరాజు గారిపల్లె పంచాయతీ దేవళంపల్లిలో డీసీసీబీ మాజీ చైర్మన్ పోలిరెడ్డి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీడీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యా రు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీటిని అందించేందుకు ఈనెల 11, 12వ తేదీల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా చిన్నమండెంలో శంకుస్థాపన కార్యక్రమం చేపడతామన్నారు. 2027 సంవత్సరం నాటికి నియోజకవర్గంలో తాగునీటి సమస్య అనేది లేకుండా చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలోని 854 గ్రామాలకు శాశ్వతంగా 300 ట్యాంకులను ఏర్పాటు చేసి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్నారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో శ్రీకాంత్‌రెడ్డి రూ.7 కోట్లతో హంద్రీ-నీవా కాలువ ద్వారా శ్రీనివాసపురం రిజర్వాయర్ నిర్మాణానికి శంకుస్థాపన చేపట్టి తన తండ్రి పేరు ఉండాలి అనే కారణంగానే ఈ రిజర్వాయర్ పనులు జరగకుండా చేశారన్నారు. కూటమి ప్రభుత్వం చెప్పిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజలకు అన్ని విధాలా ఆదుకుంటోందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మదన్‌మోహన్, రాష్ట్ర అటవీశాఖ డైరెక్టర్ ఎర్రగుల్ల పెద్దరెడ్డి, కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, షఫీనాయక్, సింగిల్‌విండో ప్రెసిడెంట్ దేవేంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ ఉమాపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ కేంద్రంగా పీలేరు?

6

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

● ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగిన రిజిస్ట్రేషన్ల పరిశీలన
● గ్రామకంఠ భూముల రిజిస్ట్రేషన్‌పై పూర్తి స్థాయి ఆరా
● ఇటీవల భారీ ఎత్తున జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్లపై పరిశీలన


రాజంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న ఏసీబీ అధికారులు

రాజంపేట/రాజంపేట టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్త రిజిస్ట్రేషన్ కార్యాలయాల దాడుల్లో భాగంగా రాజంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై బుధవారం ఉదయం ఏసీబీ అధికారులు దాడులు ప్రారంభించారు. బుధవారం ఉదయం 11 గంటల నుంచి రాత్రి పొద్దుపోయేంతవరకు ఈ సోదాలు జరుగుతూనే ఉన్నాయి. కడప ఏసీబీ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో ఈ సోదాలు జరుగుతున్నాయి. ఉదయం రాజంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకున్న ఏసీబీ అధికారులు కార్యాలయానికి ప్రవేశించిన వెంటనే కార్యాలయ తలుపులు మూసివేసి కార్యాలయంలో ఉన్న సిబ్బందిని, అక్కడున్న కొంతమంది స్టాంపు రైటర్లను రిజిస్ట్రేషన్‌లకు వచ్చిన కొంతమంది ప్రైవేటు వ్యక్తులను కార్యాలయంలో అనధికారికంగా పనిచేస్తున్న ఇరువురు వ్యక్తులను తమ అదుపులోకి తీసుకుని వారిని విచారించారు. రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వ్యక్తులను విచారించి ఆ తర్వాత వారిని బయటకు పంపారు. మిగిలిన వారిని తమ అదుపులోనే ఉంచుకుని విచారిస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం రాత్రి కార్యాలయం ఎదుట వేచి ఉన్న విలేకరులతో ఏసీబీ సీఐ నాగరాజు మాట్లాడుతూ రాజంపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉదయం నుంచి అన్ని రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను పరిశీలిస్తున్నామని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జరిగిన రిజిస్ట్రేషన్ల వ్యవహారంపై ఆరా తీస్తున్నామని, ఈ రిజిస్ట్రేషన్ల రికార్డుల పరిశీలన ఉదయం నుంచి జరుగుతోందన్నారు. పూర్తి స్థాయి పరిశీలన ఇంకా పూర్తి కాలేదని అన్నారు. అన్ని రికార్డులు పరిశీలించిన తర్వాత పూర్తి వివరాలను వెల్లడిస్తామని తెలిపారు.

కీలక సూత్రధారి సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు డుమ్మా

ఏసీబీ అధికారులు సోదాలు జరిపే సమయంలో కార్యాలయ ప్రధాన అధికారి సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు కార్యాలయానికి రాలేదు. ఆయన సెలవుపై వెళ్లడం వల్ల కార్యాలయానికి రాలేదని తెలుసుకున్న ఆయనకు ముందస్తుగా ఏసీబీ సోదాలు జరుగుతాయన్న సమాచారం తెలిసి రాలేదని తెలుస్తోంది. మిగిలిన సీనియర్ అసిస్టెంట్‌తో కలిసి ఐదుగురు సిబ్బంది, మరో ఇరువురు అనధికారిక సిబ్బంది ఉండగా ఈ విచారణ వారితో కొనసాగుతోంది. ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న సబ్ రిజిస్ట్రార్ ఏసీబీ అధికారులు తనిఖీలు చేస్తున్న సమయంలో కార్యాలయానికి డుమ్మా కొట్టడం పెద్ద చర్చనీయాంశంగా మారింది.

గ్రామకంఠం భూముల రిజిస్ట్రేషన్లపై ఆరోపణల వెల్లువ

ఆరు నెలలుగా రాజంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పెద్దఎత్తున గ్రామకంఠ భూములు అనధికారికంగా రిజిస్ట్రేషన్లు అయినట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందినట్లు తెలుస్తోంది. గ్రామకంఠ భూములు అనేక ఏళ్లుగా ఎవరైనా అనుభవంలో ఉంటే సంబంధిత వీఆర్వో, ఆర్ఐ, తహసీల్దారు అనుమతితో అనుభవ సర్టిఫికెట్లు పొంది ఆ సర్టిఫికెట్ల ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేసుకోవాల్సి ఉంది. అయితే ఇటీవల గ్రామకంఠ భూముల అనుభవ సర్టిఫికెట్లు ఇవ్వడంలో గతంలో రెవెన్యూ అధికారులు భారీ ఎత్తున ముడుపులు తీసుకుని కోట్లు విలువ చేసే గ్రామకంఠ భూములను అనుభవ సర్టిఫికెట్లు ఇచ్చి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామకంఠ భూములను రెవెన్యూ అధికారుల అనుభవ సర్టిఫికెట్లతో కోట్ల విలువ చేసే భూములు రిజిస్ట్రేషన్లు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ గ్రామకంఠ భూములపై నిబంధనలు కఠినతరం చేయడంతో రెవెన్యూ అధికారులు అనుభవ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. అయితే రాజంపేట సబ్ రిజిస్ట్రార్ కొందరి డాక్యుమెంట్ రైటర్లు, ఇతర నాయకులు, రియల్టర్లు భారీ మొత్తంలో లంచాలు ఇచ్చి రెవెన్యూ అనుభవ సర్టిఫికెట్లు లేకుండానే వందలాది రిజిస్ట్రేషన్లు చేసినట్లు తెలిసింది. ఈ విషయం ఇతరులకు తెలియడంతో వారు కూడా సబ్ రిజిస్ట్రార్‌ను బ్లాక్ మెయిల్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిసింది. అంతేగాక ప్రభుత్వ, డీకేటీ భూములను పక్కనున్న పట్టా భూముల నెంబర్లు వేసి అనేక రిజిస్ట్రేషన్లు చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై పెద్దఎత్తున ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లినట్లు తెలిసింది. ఇటీవలే రాజంపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సంబంధిత రిజిస్ట్రేషన్ శాఖ రాష్ట్ర అధికారులు గుట్టుచప్పుడు కాకుండా రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని తనిఖీ చేసి విచారణ చేసినట్లు తెలిసింది.


వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ సీఐ నాగరాజు

ఏసీబీ తనిఖీల సందర్భంగా రైటర్లు పరార్


గదులకు తాళాలు వేసి వెళ్లిపోయిన రైటర్లు

ఏసీబీ అధికారులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేయడానికి రావడంతో ఒక్కసారిగా డాక్యుమెంట్ రైటర్లు సుమారు 15 మంది తమ గదులను మూసివేసి తాళాలు వేసి పరారయ్యారు. ఈ అవినీతిలో అనేకమంది రైటర్లే సబ్‌రిజిస్ట్రార్‌ను తప్పుదోవ పట్టించి తప్పుడు రిజిస్ట్రేషన్లకు పురమాయించినట్లు తెలిసింది. ఈ విషయమై ఏసీబీ సోదాల సందర్భంగా కార్యాలయంలోనే ఉన్న రైటర్లను ఏసీబీ అధికారులు విచారణ చేసినట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకుని మిగిలిన డాక్యుమెంట్ రైటర్లు పత్తా లేకుండా పోవడం చర్చనీయాంశంగా మారింది.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికే శిబిరాలు: కలెక్టర్


వినతులను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

నందలూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకే జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్లలో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నామని కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో కలెక్టర్ ప్రజల నుంచి వివిధ రకాల అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించామని, జిల్లావ్యాప్తంగా మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో మూడు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామన్నారు. రాజంపేట, మదనపల్లె, రాయచోటి మూడు డివిజన్లలో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో రాజంపేట సబ్‌కలెక్టర్ భావన, తహసీల్దారు అమరేశ్వరి, ఎంపీడీవో కేఆర్‌ఎం ప్రసాద్, ఈవోఆర్డీ సునీల్‌కుమార్, మండలంలోని ఇతర శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

బియ్యం సకాలంలో తరలించాలి

● జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్


బియ్యం గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

కలకడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్ ద్వారా ప్రజలకు పంపిణీ చేసే బియ్యం రేషన్ దుకాణాలకు సకాలంలో తరలించాలని జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన కలకడలోని సివిల్ సప్లయ్ గోడౌన్‌ను పరిశీలించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే బియ్యం నిల్వల గురించి ఆరా తీశారు. పంపిణీలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సీఎస్‌డీటీకి సూచించారు. గోడౌన్ అద్దె భవనంలో నిర్వహిస్తున్న దృష్ట్యా పక్కా భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఎంపిక చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేశ్వరిబాయి, సీఎస్‌డీటీ రమేష్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిపై యాసిడ్ దాడి

రాజంపేటటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హత్యరాల గ్రామంలో మన్యం రవిపై బుధవారం కొందరు యాసిడ్‌తో దాడిచేసి గాయపరిచారు. వివరాల్లోకి వెళితే... ప్రకాశం జిల్లా రాజపూరి గ్రామానికి చెందిన మన్యం రవి ఆరేళ్ల క్రితం హత్యరాలకు చెందిన సుబ్బరత్న అనే అమ్మాయిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. అప్పటి నుంచి అతనిపై అమ్మాయి తరపు బంధువులు గతంలో రెండుసార్లు దాడి చేసినట్లు బాధితుడు తెలిపాడు. ఇందులో భాగంగానే ప్రస్తుతం కూడా తనపై వారే దాడి చేశారని ఆరోపిస్తున్నాడు. అయితే దాడి చేసిన వ్యక్తి హత్యరాల గ్రామానికి చెందిన వ్యక్తిగా చెబుతున్నాడు. కాగా బాధితుడు రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయంపై మన్నూరు సీఐ ప్రసాద్‌బాబు కేసు నమోదు చేసి ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. దాడి చేసిన వారిని గుర్తించాల్సి ఉందని ఆయన తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్యాయత్నం చేసుకుందని పోలీసులు తెలిపారు. పీటీఎం మండలం రంగసముద్రంలో చోటు చేసుకున్న సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాల మేరకు రంగసముద్రం వాసులు లక్ష్మీదేవి, ఈశ్వరప్ప కుమార్తె భార్గవిని రెండేళ్ల కిందట అనంతపురం జిల్లా కదిరి పట్టణానికి చెందిన సాయివినయ్‌కుమార్‌కు ఇచ్చి వివాహం చేశారు. భార్యాభర్తలు ఇద్దరు ఓ కోళ్లఫారంలో పనిచేస్తున్నారు. మూడు రోజుల కిందట కుటుంబ కలహాల కారణంగా భార్గవి పుట్టింటికి వచ్చింది. బుధవారం ఉదయం క్రిమిసంహారిణి తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం డాక్టర్లు తిరుపతికి రెఫర్ చేశారు. ఈ మేరకు పీటీఎం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వృద్ధుడిపై ఎలుగుబంటి దాడి

సిద్దవటం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చలమారెడ్డి కొట్టాల కు చెందిన గోపాలయ్య (75)పై ఎలుగుబంటి దా డి చేసింది. లంకమల్ల అ భయారణ్యం రిజర్వు ఫారెస్ట్ పరిధిలోని వన్నేశ్వరం వంక ప్రాంతానికి వెళ్లిన గోపాలయ్యపై అకస్మాత్తుగా ఎలుగుబంటి దాడి చేసింది. తల, కన్ను, చెవి, దవడ వద్ద తీవ్ర గాయాలయ్యాయి. దాని బారి నుంచి తప్పించుకుని గ్రామానికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని కడప రిమ్స్‌కు తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మేఘశ్రీ ఎంపిక


మేఘశ్రీ

పెద్దతిప్పసముద్రం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు పెద్దతిప్పసముద్రం మండలం కాట్నగల్లు వాసి మేఘశ్రీ ఎంపికైనట్లు మండల విద్యాశాఖాధికారులు నారాయణ, గౌసపీర్ తెలిపారు.

ఈనెల 8, 9వ తేదీల్లో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి హైజంప్ పోటీల్లో పాల్గొననుంది. మేఘశ్రీ ములకలచెరువు బాలికల గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. వారం రోజులుగా మండల, నియోజకవర్గం, జిల్లాస్థాయిలో జరిగిన హైజంప్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి హైజంప్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన గురుకుల పాఠశాల విద్యార్థిని మేఘశ్రీని ఆ పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, అధికారులు అభినందించారు.

ఇంటి పన్ను వసూళ్లలో వెనుకబడ్డాం

● బకాయిలు రూ.17 కోట్లు..
వసూలైంది రూ.17 లక్షలు
● డీపీవో రాధమ్మ


పీలేరు పంచాయతీ కార్యాలయంలో మాట్లాడుతున్న డీపీవో రాధమ్మ

పీలేరు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్ను వసూళ్లలో వెనుకబడ్డామని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) రాధమ్మ తెలిపారు. బుధవారం ఆమె పీలేరు పంచాయతీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ట్యాక్స్ వసూళ్లలో వేగం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఇకపై పన్ను ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చన్నారు. ఇంటి యజమాని ఫోన్‌కు మెసేజ్ వస్తుందని, అందుకు అనుగుణంగా ట్యాక్స్ చెల్లించవచ్చని ఆమె చెప్పారు. పన్ను వసూళ్లలో జిల్లా టార్గెట్ రూ.14.96 కోట్లని, గత ఏడాది అరియర్స్‌తో రూ. 2.67 కోట్లు ఉందన్నారు. మార్చి 31 నాటికి జిల్లాలో అరియర్స్‌తో కలిపి రూ.17.63 కోట్లు వసూలు చేయాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు కేవలం జిల్లాలో రూ.17 లక్షలు మాత్రమే వసూలు చేసినట్లు ఆమె తెలిపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్య ధోరణి అవలంబించరాదని, కష్టం తెలియకుండా ఉద్యోగం చేయాలంటే కుదరదని హెచ్చరించారు. చాలా మందిలో భయంలేనితనం ఉందని, దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఇంటి ముందే ఉద్యోగం చేయడమే ప్రధాన కారణమన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తే బదిలీలు తప్పవని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా శానిటేషన్‌పై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, అంటురోగాలు ప్రబలకుండా పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో ముందుకు పోవాలని సూచించారు. పీలేరులోని మినరల్ వాటర్ ప్లాంట్లలో పనిచేస్తున్న వర్కర్ల పెండింగ్ జీతాలు చెల్లిస్తామని తెలిపారు. పట్టణంలో పనిచేస్తున్న 26 మినరల్ వాటర్ ప్లాంట్లలో పనిచేస్తున్న వర్కర్లకు నెలకు రూ.6 వేలు చొప్పున 14 నెలలు జీతాలు చెల్లించాల్సి ఉందని, దీనిపై కలెక్టర్‌తో సంప్రదించి వీలైనంత త్వరగా పెండింగ్ జీతాలు ఇప్పిస్తామని ఆమె చెప్పారు. పెండింగ్ జీతాలు చెల్లించిన అనంతరం ప్రస్తుతం పనిచేస్తున్న వర్కర్లను తొలగించి వారి స్థానంలో పంచాయతీ వర్కర్లనే నియమించి పట్టణ ప్రజలకు తాగునీరు అందిస్తామని తెలిపారు. సమావేశంలో ఈవో బ్రహ్మానందరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల్లో వసతులు కల్పించాలి

● ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరాజు


మోడల్ స్కూల్ తరగతి గదుల్లో వసతులను పరిశీలిస్తున్న అధికారులు

తంబళ్లపల్లె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): టెన్త్ పబ్లిక్ పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు తప్పనిసరిగా కల్పించాలని ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ కొండూరు శ్రీనివాసరాజు ఆదేశించారు. పాఠశాల విద్యా కమిషనర్ విజయరామరాజు ఆదేశాల మేరకు బుధవారం ఆయన ఎంఈవోలతో కలిసి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్ టెన్త్ పరీక్షా కేంద్రాల్లో వసతులను పరిశీలించారు. కేంద్రాల్లో తరగతి గదులు, డెస్కులు, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులను పరిశీలించారు. పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు సమగ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంఈవోలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, హెచ్‌ఎంలు హేమంత్‌కుమార్, శ్రీనివాసులు, సూపరింటెండెంట్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

12మంది బైండోవర్

నిమ్మనపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండ్లపై పంచాయతీ భూమలగడ్డ గ్రామంలోని ప్రభుత్వ భూమి అక్రమణలో 12 మందిని తహసీల్దార్ తపస్విని ఎదుట బైండోవర్ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ భూమలగడ్డ గ్రామం సర్వే నెంబరు, 28-5లో ఉన్న 6 ఎకరాల 70 సెంట్ల ప్రభుత్వ భూమిని ఎలాంటి అనుమతులు లేకుండా ఆదే గ్రామానికి చెందిన 12 మంది అక్రమించుకుని చదును చేస్తుండగా అడ్డుకుని కంచె ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ భూమిని ఎవరైనా అక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కాగా మాజీ సైనికుల్లో కొందరికి ఇదే స్థలంలో చెట్ల పెంపకానికి టూసీ పట్టాలు ఇచ్చినట్లు మాజీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులునాయుడు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రాంప్రసాద్, వీఆర్‌ఓ క్రిష్ణప్ప, పోలీసులు పాల్గొన్నారు.

వల్లభాయ్ పటేల్ ఆశయాలను కొనసాగిద్దాం

● రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


ఐక్యతా దివస్ ర్యాలీలో పాల్గొన్న మంత్రి మండిపల్లి, కూటమి నాయకులు

రాయచోటిటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలను కొనసాగిద్దామని మంత్రి మండపల్లి రాంప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఆయన రాయచోటి పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జాతీయ ఐక్యతా దివస్ కార్యక్రమంలో కూటమి నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2014లో భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఐక్యతా దివస్ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. మన దేశానికి ఉక్కు మనిషిగా పేరుగాంచిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ప్రతి ఏడాది ఐక్యతా దివస్ కార్యక్రమాన్ని జరుపుతారన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో కీలక పాత్ర పోషించిన వల్లభాయ్ పటేల్ స్వాతంత్ర్యం అనంతరం కూడా దేశ సేవ కోసం తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. అలాంటి మహోన్నత వ్యక్తి ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేశ్‌నాయుడు, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ పాలగిరి శ్రీనివాస్‌కుమార్‌రాజు, జిల్లా కార్యదర్శి ఆనందగజపతిరాజు, సీనియర్ నాయకులు అరమాటి శివగంగిరెడ్డి, బీజేపీ నాయకులు జానం బాలాజీ యాదవ్, రాజశేఖర్‌రెడ్డి, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించండి


సమావేశంలో మాట్లాడుతున్న వాసునూరి చంద్రశేఖర్

కలికిరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): త్వరలో ప్రారంభం కానున్న ప్రతిష్టాత్మక ఆదరణ 3.0 పథకాన్ని శాస్త్రీయ పద్ధతుల్లో అమలు చేయాలని, వివిధ బీసీ కులాల వారికి వారి జనాభా ప్రాతిపదికన దామాషా మేరకు నిధులు కేటాయించాలని రాష్ట్ర జంగమ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వాసునూరి చంద్రశేఖర్ స్పష్టం చేశారు. రూ.వేయి కోట్లతో అమలు చేయనున్న ఆదరణ 3.0 పథకం విధివిధానాల కోసం బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత బుధవారం రాజధానిలో వివిధ బీసీ కార్పొరేషన్ల చైర్మన్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాత కులవృత్తులు మనుగడ కోల్పోయి ఆధునిక వృత్తులైన ఎలక్ట్రికల్ కుట్టు మిషన్‌లు, జిగ్‌జాగ్, ఎంబ్రాయిడరీ మిషన్లను ఉపయోగించడంలో మహిళలు తర్ఫీదు పొందారని మరి కొందరికి వాషింగ్ మిషన్లు, ఎలెక్ట్రికల్ ఐరన్ బాక్సులు అందజేయాలని చంద్రశేఖర్ సూచించారు.

ప్రధానంగా జంగం కులస్తులకు ప్రభుత్వం ప్రకటించిన 100 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అన్ని జిల్లాల్లో అమలు చేయాలని కోరారు. గతంలో రూ.30 వేల వంతున ఇస్తున్న ఆర్థిక చేయూతను రూ.లక్షకు పెంచాలని చెప్పారు. కాగా బీసీ జనాభా వివరాలను కులాల వారీ కలెక్టర్ల నుంచి తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు చంద్రశేఖర్ తెలిపారు. బీసీ సంక్షేమ వసతి గృహాలను కార్పొరేషన్ చైర్మన్లు తరచూ తనిఖీ చేయాలని మంత్రి సూచించినట్లు చెప్పారు. కార్పొరేషన్ చైర్మన్లకు దేవాలయాల్లో ప్రొటోకాల్ పాటించేలా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసేందుకు మంత్రి హామీ ఇచ్చారు.

రెవెన్యూ డివిజన్ కేంద్రంగా పీలేరు?

● సీసీఎల్ఏకు ప్రతిపాదనలు పంపిన మంత్రివర్గ ఉపసంఘం



పీలేరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా పీలేరు ప్రాంత వాసులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పే అవకాశం కనిపిస్తోంది. అమరావతిలో బుధవారం జిల్లాల పునర్విభజనపై మంత్రివర్గ ఉపసంఘం భేటీ జరిగింది. ఈ సందర్భంగా పీలేరును రెవెన్యూ డివిజన్ కేంద్రం చేయాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ మేరకు సీసీఎల్ఏకు ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తోంది.

పీలేరు నియోజకవర్గంలో.. : పీలేరు, కేవీపల్లె, కలకడ, గుర్రంకొండ, కలికిరి, వాల్మీకిపురం మండలాలు ఉన్నాయి. వీటిలో పీలేరు, కేవీపల్లె, కలకడ, గుర్రంకొండ మండలాలు రాయచోటి రెవెన్యూ డివిజన్‌లో, కలికిరి, వాల్మీకిపురం మండలాలు మదనపల్లె డివిజన్‌లో ఉన్నాయి. ఒక నియోజకవర్గంలోని అన్ని మండలాలు ఒకే రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండాలన్న ప్రభుత్వ అభిమతం మేరకు పీలేరు నియోజకవర్గంలోని ఆరు మండలాలను ఒకే రెవెన్యూ డివిజన్ పరిధిలోకి చేర్చే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం పుంగనూరు నియోజకవర్గంలో ఉంటూ చిత్తూరు రెవెన్యూ డివిజన్‌లో ఉన్న రొంపిచెర్ల, పులిచెర్ల మండలాలు, పలమనేరు డివిజన్‌లో ఉన్న సదుం, సోమల మండలాలను కూడా ప్రతిపాదిత పీలేరు రెవెన్యూ డివిజన్‌లో కలపాలన్న డిమాండ్లు ఉన్నాయి. దీంతో వీటిని కూడా కలిపి పీలేరును రెవెన్యూ డివిజన్ కేంద్రం చేయనున్నారని సమాచారం. పీలేరును రెవెన్యూ డివిజన్ చేస్తే.. పుంగనూరు, పీలేరు నియోజకవర్గాల్లోని మండలాల వారు చేరుకోవాలంటే డివిజన్ కేంద్రం కేవలం 30 కి.మీ దూరం మాత్రమే ఉంటుంది.

నీటమునిగిన ఆటో డ్రైవరు మృతి

పెనగలూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగరాజపురం గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లంపాడు గ్రామానికి చెందిన గండికోట వెంకటేశ్ (30) అనే ఆటో డ్రైవర్ బుధవారం సాయంత్రం నీటమునిగి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు... వెంకటేశ్ ఆటో తోలుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం కూడా పెనగలూరు బస్టాండు నుంచి ప్యాసింజర్లను ఆటోలో ఎక్కించుకుని కోడిచిన్నయగారిపల్లెలో దింపి ఆటోను పార్కింగ్ చేశాడు. మోకాటి లోతు చెయ్యేటిలో నడుచుకుంటూ పల్లంపాడుకు చేరుకున్నాడు. అనంతరం సాయంత్రం బహిర్భూమికి వెళ్లి గ్రామదేవత పల్లమ్మగుడి వెనుకాల గల చెయ్యేటిలో కాళ్లు, చేతులు శుభ్రం చేసుకునేందుకు నీటిఒడ్డుకు వెళ్లాడు.

కాళ్లు జారి ప్రమాదవశాత్తు నీటిలో పడ్డాడు. గమనించిన ఇద్దరు వ్యక్తులు వెంటనే గట్టిగా కేకలు వేయడంతో సమీపంలోని ప్రజలు, కుటుంబ సభ్యులు ఏటివద్దకు చేరుకుని నీటమునిగిన వెంకటేశ్‌ను బయటకు తెచ్చారు. వెంటనే 108 అంబులెన్స్ ద్వారా పెనగలూరు పీహెచ్‌సీకి తరలించారు. డ్యూటీ నర్సు శాంతి ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించారు. కాగా అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కాగా పెనగలూరు ఏఎస్ఐలు ఎ.రాముడు, మల్లికార్జున ఆసుపత్రికి వచ్చి వివరాలు సేకరించారు. మృతుడికి భార్య, మూడేళ్ల లోపు ఇద్దరు పిల్లలు, తల్లి ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామంలో సౌమ్యుడిగా పేరు తెచ్చుకున్న వెంకటేష్ అకాల మరణం పట్ల పల్లంపాడులో విషాదఛాయలు అలముకున్నాయి.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

అటవీ క్షేత్రాధికారి జయప్రసాదరావు


ఆలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం

పీలేరు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మొక్కల పెంపకంతో పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని పీలేరు రేంజ్ అటవీ క్షేత్రాధికారి జయప్రసాద్, ఎస్ఐ లోకేశ్ తెలిపారు. బుధవారం మద్దుండాల మల్లేశ్వరస్వామి ఆలయ ఆవరణలో కార్తీక వన సమారాధనలో భాగంగా మొక్కలు నాటిన వారు మాట్లాడుతూ రోజురోజుకు వాతావరణ కాలుష్యం పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విపత్కర పరిస్థితుల నుంచి బయటపడాలంటే విరివిగా మొక్కలు నాటి సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. లేదంటే భవిష్యత్ అంధకారమేనని తెలిపారు. మొక్కుబడిగా మొక్కలు నాటి వదిలేయడం వల్ల ఎటువంటి ఉపయోగం ఉండదని హెచ్చరించారు. వాతావరణ కాలుష్యం పెరిగిపోతున్న కారణంగా అతివృష్టి, అనావృష్టి వంటి సమస్యలు ఉత్పన్నమౌతున్నాయని వివరించారు. పర్యావరణ పరిరక్షణలో అందరినీ భాగస్వాములను చేయడం కోసం తరచూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో తలపుల మాజీ సర్పంచ్ అబ్బవరం అమరనాథ రెడ్డి, హరిబాబు నాయుడు, తలపుల బీటు అధికారి శ్రీనివాసన్, వన సంరక్షణ సమితి, ఆలయ కమిటీ సభ్యులు లింగమ్మ, వెంకటరమణ, వెంకటయ్య నాయుడు, చెంగల్‌రాయులు, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

13న మెగా జాతీయ లోక్‌అదాలత్

వాల్మీకిపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టులో డిసెంబరు 13న జరగనున్న జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జడ్జి గురు అరవింద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్షణికావేశంలో కేసులు పెట్టుకోవడం ద్వారా జీవితాలు దుర్భరం అవుతాయని, కేసులతో సతమతమవుతున్న కక్షిదారులకు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్‌అదాలత్ చక్కటి వేదిక అని తెలియజేశారు. సివిల్, క్రిమినల్, బ్యాంకుల రుణాలు, రాజీకాదగ్గ కేసులన్నింటినీ పరిష్కరిస్తారని కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోలీసులు, న్యాయవాదులు కూడా సహకరించి జతీయ మెగా లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం నాగలక్ష్మి

కురబలకోట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి క్రికెట్, వాలీబాల్ జట్టుకు అంగళ్లు జడ్పీహైస్కూల్ విద్యార్థులు నేత్ర, ఇమ్రాన్ ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం నాగవేణి తెలిపారు. కురబలకోట మండలం తెట్టు పంచాయతీ రిషివ్యాలీ వాసులు రాజేంద్రనాయుడు కుమార్తె నేత్ర, అంగళ్లుకు చెందిన మౌలాలి కుమారుడు ఇమ్రాన్ టెన్త్ చదువుతున్నారు. చిత్తూరులో జరిగిన అండర్-17 స్కూల్ గేమ్స్ పోటీల్లో సత్తా చాటి మహిళల క్రికెట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి జట్టుకు నేత్ర ఎంపికైంది. ఈమె ఎన్‌టీఆర్ జిల్లాలో జరిగే పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఇటీవల అంగళ్లులో జరిగిన అండర్-17 స్కూల్ గేమ్స్ పోటీల్లో ఇమ్రాన్ వాలీబాల్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యాడు. కాగా విద్యార్థి పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరులో ఈనెల 20 నుంచి 24 వరకు జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైన విద్యార్థులను ఎంఈవో ద్వారకనాథ్, హెచ్‌ఎం నాగలక్ష్మి, పీడీ రమేశ్ తదితరులు అభినందించారు.

వంద శాతం మార్కులు సాధించాలి

విద్యార్థులతో డ్వామా పీడీ వెంకటరత్నం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డ్వామా పీడీ వెంకటరత్నం

రామాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మార్చిలో జరగనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు వందశాతం మార్కులు సాధించాలని డ్వామా పీడీ వెంకటరత్నం అన్నారు. మండల పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో బుధవారం ఆయన 10వ తరగతి విద్యార్థులకు చదువు పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి మార్కులు సాధించి ఉన్నత స్థాయికి వెళ్లినప్పుడే అటు తల్లిదండ్రులకు, చదువు చెప్పిన గురువులకు మంచిపేరు వస్తుందన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు బానిస కాకుండా మంచిగా చదువుకోవాలన్నారు. విద్యార్థులు ప్రతిరోజు స్నానం చేసి పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని ఆయన అన్నారు. అనంతరం మెనూ ప్రకారంగా భోజనాలు అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రామకృష్ణుడు, కళాశాల ప్రిన్సిపాల్, ఏపీవో పెంచలయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.లక్ష సాయం

నారా లోకేశ్ ఆదేశాలతో ఆదుకున్న కట్టా దొరస్వామినాయుడు


ఆర్థికసాయం అందజేస్తున్న టీడీపీ యువ నేత కట్టా దొరస్వామినాయుడు

మదనపల్లె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): షమీవుల్లా కుమారుడు అయాన్ చికిత్స కోసం బుధవారం తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ యువనేత కట్టా దొరస్వామినాయుడు రూ.లక్ష అందజేశారు. మెట్లపై ఆడుకుంటూ బాలుడు కిందపడడంతో తీవ్ర అస్వస్థతకు గురై బెంగళూరులోని రెయిన్‌బో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

నిరుపేద కుటుంబం కావడంతో చికిత్స చేయించుకునేందుకు ఆర్థిక స్థోమత లేదని ఆదుకోవాలని బాలుడి తండ్రి షమీవుల్లా సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో మంత్రి నారా లోకేశ్ స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో కట్టా దొరస్వామినాయుడు మదనపల్లెలోని పార్టీ కార్యాలయంలో తన వంతు సాయంగా రూ.లక్షను షమీవుల్లా కుటుంబానికి అందజేశారు. కట్టా దొరస్వామినాయుడు మాట్లాడుతూ నిరుపేదలను ఆదుకునేందుకు టీడీపీ అండగా ఉంటుందన్నారు. బాలుడు పూర్తిగా కోలుకుని ఇంటికి వచ్చే వరకు టీడీపీ అండగా ఉంటుందన్నారు.

ఉద్యాన పంటలకు తెగుళ్లు

● మందులు పిచికారి చేసినా అదుపు కాని పరిస్థితి ● దిగుబడి తగ్గుతుందని రైతుల్లో ఆందోళన



బొబ్బడాల తెగులు సోకిన పసుపు పంట

రాజుపాలెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించే రైతన్నలను ఎడతెరిపి లేని వర్షాలు కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. లక్షల రూపాయలు వెచ్చించి సాగు చేసిన ఉద్యాన పంటలకు తెగుళ్ల సోకడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. పసుపులో బొబ్బడాల తెగులు, ఆకుతోటల్లో ఆకులు పసుపు వర్ణంలోకి మారడంతో రైతన్నలకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది.

రాజుపాలెం మండలంలోని టంగుటూరు, కొట్టాల, దువ్వూరు మండలంలోని కానగూడూరు, జిల్లెల్ల, భాకరాపేట తదితర గ్రామాల రైతులు దాదాపు 350 ఎకరాల పైబడి పసుపుం పంట సాగు చేశారు. పంట ఊటపర్వం (కొమ్ములు సాగే) దశలో అధిక వర్షాలకు తేమ శాతం ఎక్కువై పంటలకు బొబ్బడాల తెగులు సోకింది. కార్తీక మాసంలో ఊట పర్వం మొదలై డిసెంబరు వరకు మంచి దిగుబడినిచ్చే తరుణంలో తెగుళ్ల సోకాయి. రైతులు మందు లు పిచికారి చేసినా అదుపు కావడం లేదు. కొమ్ముల్లో పురుగు ఏర్పడి, మొదటి దశలోనే కుళ్ల తెగులు పడిందని రైతులు తెలి పారు. ప్రభుత్వం కూడా దెబ్బతిన్న పంటలకు ఆర్థికసాయం అందించాలని కోరుతున్నారు. ఒక ఎకరాకు ఒకటిన్నర లక్ష పైబడి ఖర్చు వస్తుందని.. 30 క్వింటాళ్ల దిగుబడి వస్తే ఇప్పుడున్న రేటు ప్రకారం రూ.2.50 లక్షలు వస్తుందని.. ఈ తెగుళ్ల వల్ల దిగుబడి తగ్గుతుందని రైతులు వాపోతున్నారు.

భారీ పెట్టుబడులు పెట్టి కంటికి రెప్పలా కాపాడు కుంటున్న ఆకుతోటలు అధిక వర్షాలకు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆకులు వచ్చే తరుణంలో తమల పాకులు లేత ఆకుపచ్చగా ఉండాలని.. అలా కాకుండా పసుపు వర్ణం తిరగడం ద్వారా తీగ చనిపోవడంతో పాటు దిగుబడులు కూడా తగ్గుతాయని రైతులు సతమతమవుతున్నారు. ఇప్పటికైనా ఉద్యానశాఖాధికారులు పసుపు, ఆకుతోటలను పరిశీలించి తగు సూచనలు సలహాలు ఇవ్వాలని పలువురు రైతులు కోరుతున్నారు.



పసుపు వర్ణం తిరిగిన ఆకుతోట

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం, ఆదాయం

● ప్రాజెక్టు జిల్లా మేనేజర్ ప్రవీణ్‌కుమార్



ఘన జీవామృతం తయారీని వివరిస్తున్న డీపీఎం

పులివెందుల రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం జీవకోటికి ఆరోగ్యకరం, రైతులకు ఆదాయకరమని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు జిల్లా మేనేజర్ ప్రవీణ్‌కుమార్, అడషనల్ డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్ వసంతకుమారిలు సూచించారు. బుధవారం పట్టణంలోని ఏపీ కార్ల్‌లోని వ్యవసాయ కళాశాలలో మూడో రోజు ఐసీఆర్పీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా 400 కేజీల ఘనజీవామృతం తయారీని చేసి చూపించారు. ఘనజీవామృతం పంటలకు ఏ విధంగా పనిచేస్తుంది, ఇతర ప్రయోజనాలను వివరించారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను గ్రామాలలోని రైతులకు వివరించి వారిని ప్రకృతి వ్యవసాయం వైపు నడిపించాలన్నారు. దిగుబడి, ఆదాయం గురించి క్షుణ్ణంగా వివరించాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సురేష్, ఉష, మనోజ్, భరత్, సందీప్, రబ్బాని తదితరులు పాల్గొన్నారు.

రోగుల సౌకర్యార్థం రిమ్స్‌కు బస్సు



బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

కడప సెవెన్ రోడ్స్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి):కడప నగర పరిధిలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి బుధవారం బస్సును ప్రారంభించారు. ఈబస్సు రిమ్స్ నుంచి పాత బస్టాండ్, పాత బస్టాండ్ నుంచి రిమ్స్ వరకు ప్రతిరోజు సర్వీసులను నడుపుతుంది. ఈ బస్సు సర్వీసులను ఆసుపత్రి ప్రాంగణంలో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్యే మాధవి ప్రారంభించారు. ప్రతిరోజు పాత బస్టాండ్ నుంచి ఉదయం 10, 11, 12గంటలకు,సాయంత్రం 4గంటలకు అందుబాటులో ఉంటుంది. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జమున, ఆసుపత్రి సూపరింటెండెంట్, సీఎస్ఆర్ఎంఓ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం...

● కాపాడిన పోలీసులు



రైల్వేట్రాక్‌పై ఉన్న రసూల్‌తో మాట్లాడుతున్న పోలీసులు

వల్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన వల్లూరు గ్రామానికి చెందిన రసూల్ అనే వ్యక్తి స్థానిక గంగాయపల్లె రైల్వేస్టేషన్ వద్ద ఆత్మహత్యకు యత్నించారు. విషయం తెలుసుకన్న ఎస్ఐ పెద్ద ఓబన్న సిబ్బందిని అప్రమత్తం చేసి అతన్ని కాపాడారు. వివరాలిలా.. కుటుంబ సమస్యలతో మనస్థాపానికి గురైన రసూల్ గంగాయపల్లె రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వేట్రాక్‌పై పడుకుని ఆత్మహత్యకు యత్నించారు. ఈ సమచారం పుష్పగిరిలో బందోబస్తులో ఉన్న ఎస్ఐకి ఫోన్ ద్వారా అందడంతో వెంటనే స్పందించి... సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఎస్ఐ సూచనలతో కానిస్టేబుళ్లు అంజిప్రసాద్, సురేంద్ర సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకొని రసూల్‌ను కాపాడి పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చారు. జీవితం చాలా విలువైనదని, సమస్యలు వస్తే ఎదుర్కోవాలి తప్ప ఇలా చేయకూడదని కౌనెల్సింగ్ ఇచ్చారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పోలీసుస్టేషన్ పిలిపించి అప్పగించారు. కాగా, రసూల్‌ను కాపాడిన ఎస్ఐ, పోలీసులకు ప్రజలు అభినందనలు తెలిపారు.


విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి



జయన్న మృతదేహం

కాశినాయన నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) మండలంలోని వరికుంట్ల గ్రామానికి చెందిన వరికుంట్ల పోలయ్య కుమారుడు జయన్న(47) ప్రమాదవశాత్తు కరెంట్ తీగ తగిలి షాక్‌కు గురై మృతి చెందాడు. ఎస్ఐ యోగేంద్ర వివరాల మేరకు... వరికుంట్ల జయన్న తన చిన్నాన్న సంటయ్య పొలానికి అడవి పందులు రాకుండా కట్టెలు పాతి చుట్టూ కరెంట్ తీగలు ఏర్పాటు చేశారు. రోజులాగే మంగళవారం రాత్రి కరెంట్ తీగలు తగిలించేందుకు పొలం వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు పొలానికి ఏర్పాటు చేసిన కరెంట్ తీగ కాలికి తగిలి జయన్న షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం ఉదయం పశుకాపరులు గమనించి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఈవిషయం పోలీసులు, ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు వెళ్లి పరిశీలించారు. ఆమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యోగేంద్ర తెలిపారు.

శ్మశాన వాటిక లేక.... శవంతో నిరసన



భూమి యజమానితో మాట్లాడుతున్న తహసీల్దారు శివరామిరెడ్డి

కమలాపురం రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు అవుతున్నా ఇంకా కొన్ని గ్రామాలకు శ్మశానవాటిక లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఈడిగపల్లెలో యాదవ సామాజిక వర్గానికి ఇప్పటికీ శ్మశాన వాటిక లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. గ్రామం సగం కొండాయపల్లె పంచాయతీ, మరో సగం గ్రామ పెద్దచెప్పలి పంచాయతీలోకి వస్తుంది. పెద్దచెప్పలి పంచాయతీలోని సుమారు 15 యాదవ కుటుబాల వారికి అంత్యక్రియలు చేసుకునేందుకు స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఊరి సమీపంలో సర్వే నెంబరు 5లో స్థలం ఉండడంతో అక్కడే అంత్యక్రియలు నిర్వహించే వారు. ఆ స్థలాన్ని ఓ నాయకుడు పట్టా చేయించుకుని పంటలు సాగు చేసుకుంటుండడంతో సమస్య తలెత్తింది. ఈ నేపథ్యంలో బుధవారం గ్రామానికి చెందిన వృద్ధురాలు నాగమ్మ మృతి చెందడంతో ఎక్కడా అంత్యక్రియలు చేసుకోనివ్వకపోవడంతో శవంతో యాదవ కులస్తులు నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న తహసీల్దారు శివరామిరెడ్డి సిబ్బందితో గ్రామానికి చేరుకుని వారితో మాట్లాడారు. మేం ఊరు పుట్టినప్పటి నుంచి ఇక్కడే నివాసం ఉన్నామని.. అయినా మాకు శ్మశాన వాటిక లేకపోవడం దారుణమన్నారు. స్పందించిన తహసీల్దారు ముందుగా ఇచ్చిన పట్టా స్థలం యజమానులతో మాట్లాడానని.. అక్కడ అంత్యక్రియలు చేసుకోవాలని చెప్పడంతో సాయంత్రం అంత్యక్రియలు పూర్తి చేశారు. త్వరలో శ్మశానవాటిక ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దారు చెప్పడంతో గ్రామస్తులు శాంతించారు.

పదిలో వందశాతం ఫలితాలు సాధించాలి : డీఈవో



గొంటువారిపల్లె ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన డీఈవో

కాశినాయన నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని డీఈవో షంషుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం ఆయన ఇటుకులపాడు, నర్సాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు గొంటువారిపల్లె, వరికుంట్ల ప్రాథమికోన్నత పాఠశాలలను తనిఖీ చేశారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రతి విద్యార్థి ప్రాథమిక దశ దాటే సమయానికి తెలుగు, ఇంగ్లీషు చదవడం, రాయడం లాంటివి తప్పనిసరిగా నేర్పించాలన్నారు. అలాగే విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్నా భోజనం అందించేలా చూడాలన్నారు. అనంతరం నర్సాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న స్మార్ట్ కిచెన్ సెంటర్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవోలు మహమ్మద్ షఫీ, నిర్మల ప్రధానోపా ధ్యాయుడు నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫౌండేషన్ డేను విజయవంతం చేయాలి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో ప్రతి ఒక్క యూనిట్ లీడర్ తమ యూనిట్ సభ్యులతో కడప నగరం శంకరాపురంలోని జిల్లా ప్రధాన కార్యాలయం పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా చీఫ్ కమీషనర్, సెక్రటరీ జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ షంషుద్దీన్ పేర్కొన్నారు. ఈనెల 7వ తేదీన ఉదయం 8గంటలకు జరగనున్న ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్క యూనిట్ లీడర్ తమ విద్యార్థుల బయోడేటాని అందించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, త్వరలో జరిగే రాజ్యపుర స్కార్, తృతీయ సోపాన క్యాంప్‌నకు సంబంధించిన అప్లికేషన్లను అందజేయాలన్నారు. ఏదైన టెక్నికల్ సమస్యలు, ఓవైఎంఎస్ సమస్యలు ఉన్నచో కెపాసిటీ బిల్డింగ్ వర్క్ షాప్‌లో పాల్గొని తగు విషయాలను తెలుసు కోవాల్సిందిగా ఆయన పేర్కొన్నారు.

డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు



ప్రణవ్‌గోవర్ధన్, మణిదీప్, ముఖేష్ మోక్షజ్ఞ, హేమచందర్‌నాయక్

కడప స్పోర్ట్స్, నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ అండర్ 14 మెన్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లు బుధవారం డ్రాగా ముగిశాయి. వివారాలిలా........

కడప నగర రిమ్స్ సమీప వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో నెల్లూరు- చిత్తూరు జట్ల మధ్య సాగు తున్న మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు చేసిన నెల్లూరు జట్టు మొదటి రోజు (మంగళవారం) ఆట ముగిసే సమయానికి 51.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 184 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. ఓవర్ నైట్ స్కోర్‌తో తిరిగి బుధవారం బ్యాటింగ్‌కు దిగి 66.1 ఓవర్లలో 226 పరుగులకు ఆలౌట్ అయింది. అతనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 75 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 325 పరుగుల స్కోర్ వద్ద డిక్లేర్ చేసింది. దీంతో చిత్తూరు జట్టుకు 99 పరుగుల ఆధిక్యత లభిం చింది. ఇందులో ప్రణవ్‌గోవర్ధన్ 151 పరుగులు, మణిదీప్ 90 పరుగులు చేశారు. రెండో ఇన్నింగ్స్‌కు దిగిన నెల్లూరు జట్టు ఆట ముగిసే సమయానికి 4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 26 పరు గులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసి నట్లు వెల్లడించారు.

కేవోఆర్ఎం మైదానంలో అనంతపురం-కర్నూలు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో మొదటిరోజు (మంగళవారం) ఆట ముగిసే సమయానికి 45 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 174 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. తిరిగి రెండో రోజు బుధవారం బ్యాటింగ్‌కు దిగి మొత్తం 72 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 268 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఇందులో మోక్షజ్ఞతేజ్ 138 పరుగులు, హేమచందర్ నాయక్ 113 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 72 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 189 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఇందులో మోక్షజ్ఞరెడ్డి 90 పరుగులు చేశారు. దీంతో అనంతపురం జట్టుకు 79 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి 7ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 13 పరుగులు చేసింది. దీంతో ఆట డ్రాగా ముగిసినట్లు వెల్లడించారు.

కుటుంబ క్షేమం కోసం గొడవల జోలికెళ్లద్దు

● శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు ● మాబ్ ఆపరేషన్, మాక్‌డ్రిల్ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ



మాట్లాడుతున్న ఏఎస్పీ ప్రకాశ్‌బాబు, కార్యక్రమంలో పాల్గొన్న పోలీసులు, ప్రజలు

చెన్నూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు బాగుండాలన్నా.. కుటుంబాలు క్షేమంగా ఉండాలన్నా... ఎలాంటి గొడవలకు వెళ్లవద్దని అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ప్రకాశ్‌బాబు ప్రజలకు సూచించారు. జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు చెన్నూరులో బుధవారం సాయంత్రం పోలీసుల ఆధ్వర్యంలో మాబ్ ఆపరేషన్, మాక్‌డ్రిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ప్రజాశాంతికి భంగం కలిగించే అల్లరి మూకలను చెదరగొట్టడానికి పోలీసుశాఖ ఉంటుందని తెలియజేయడమే మాబ్ ఆపరేషన్, మాక్‌డ్రిల్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అదే సమయంలో ప్రజలు కూడా పోలీసుశాఖకు సహకరించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం జిల్లాలో ఎక్కడైనా శాంతిభద్రత సమస్యలు తలెత్తినపుడు అల్లరి మూకలను ఏ విధంగా చెదర గొట్టాలో పోలీసులు మాక్‌డ్రిల్ ద్వారా ప్రజలకు వివరించారు. అంతేకాక చట్టాన్ని అతిక్రమించి హింసాత్మక చర్యలకు పాల్పడేవారిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చేసి చూపించారు. పోలీసుల హెచ్చరికలు వినకపోతే పైఅధికారుల అనుమతితో భాష్పవాయువు ప్రయోగించ డం, లాఠీచార్జి చేయడం, అప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోతే ఫైరింగ్ లాంటి వాటిపై డెమో ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. అలాగే గ్రామాల్లో ఉత్సవాలు, ఊరేగింపులు, తిరునాళ్లు ఏదైనా ప్రత్యే క కార్యక్రమాల్లో ప్రజలు కలిసిమెలిసి శాంతియు తంగా నిర్వహించుకోవాలని అడిషనల్ ఎస్పీ సూచించారు. పరిస్థితి అదుపు తప్పితే నియంత్రించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్న విష యాలన్న క్షుణ్ణంగా వివరించారు. గొడవల జోలికి వెళితే పోలీసుశాఖ తీసుకునే చర్యలతో భవిష్యత్తులో పడే ఇబ్బందులు, పోలీసు కేసులు, వారి పిల్లల జీవితాలపై పడే ప్రభావం గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ రమణ య్య, కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, చెన్నూరు సీఐ క్రిష్ణారెడ్డి, ఆర్ఐలు సోమశే ఖర్‌నాయక్, టైటాస్, శ్రీశైలంరెడ్డి, ఎస్ఐలు రామస్వామిరాజు, ఏఎస్ఐలు శంకర్‌నాయక్, ఆంజనేయులు, పోలీసులు, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.



మాక్‌డ్రిల్‌లో లాఠీచార్జి నిర్వహిస్తున్న పోలీసులు

ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

● శివనామస్మరణతో మారుమోగిన శివాలయాలు ● వీరభద్రాలయానికి పోటెత్తిన భక్తులు



పాతరాయచోటిలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తజనం, రైల్వేకోడూరు: ప్రత్యేక అలంకరణలో భుజంగేశ్వరుడు, చిట్వేలి: ప్రత్యేక అలంకరణలో శ్యామలాంబదేవి

రాయచోటిటౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలో బుధవారం కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళా భక్తులు పెద్ద ఎత్తున శివాలయాలకు చేరుకుని కార్తీక దీపారాధన చేసి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దక్షిణ కాశీగా పేరుగాంచిన భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో అఘోర లింగేశ్వరుడి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అలాగే పాతరాయచోటిలోని ప్రాచీన అగస్త్యేశ్వరస్వామి ఆలయం, చెక్‌పోస్ట్ సమీపంలోని ఉమామహేశ్వర ఆలయంలో స్వామి, అమ్మవార్లు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. దిగువ అబ్బవరం గ్రామం కమ్మపల్లిలో వెలసిన శివాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా రాజంపేట పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు గుర్రం సుబ్బయ్యనాయుడు ఆధ్వర్యంలో రుద్రాభిషేకాలు నిర్వహించారు.

రాజంపేటటౌన్: పట్టణంలోని పలు శివాలయాల్లో మహిళలు కార్తీక దీపాలను వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణాలు మహిళా భక్తుల కార్తీక దీపారాధనతో నూతన శోభను సంచరించుకున్నాయి.

రైల్వేకోడూరు: పట్టణంలోని భుజంగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ఆది శంకరుడికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పవన్‌కుమార్‌శర్మ, యోగీల ఆధ్వర్యంలో భుజంగేశ్వరుడు, భువనేశ్వరిదేవికి పూజలు చేశారు. ముందస్తుగా ఆలయ కమిటీ చైర్మన్ సురేంద్రకుమార్ (చిన్నా) భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. షేక్ షంషీర్ అనే హోటల్ వ్యాపారి భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

లక్కిరెడ్డిపల్లె: లక్కిరెడ్డిపల్లెలోని శివాలయంలో బుధవారం కోటి దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే సర్వమంగళాదేవి రామలింగేశ్వరస్వామి స్వాముల వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. మహిళలు పాల్గొని దీపాలను వెలిగించారు.

చిట్వేలి: మండలంలోని అన్ని శివాలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. చిట్వేలి శివాలయంలో శ్యామలాంబ అమ్మవారికి పూలు, పండ్లతో అలంకరించి భక్తులకు దర్శనం చేయించారు. కార్యక్రమంలో ఆశ్రమం పెద్దలు కార్యనిర్వాహకులు, సీఆర్పీ చంద్ర, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

సిద్దవటం: మండల కేంద్రమైన సిద్దవటం పెన్నానదిలో వేకువజాము నుంచి మహిళలు పెద్దఎత్తున పాల్గొని భక్తి శ్రద్ధలతో కార్తీక దీపాలు వదిలారు. శివక్షేత్రాలు హోరెత్తాయి. భక్తుల రద్దీ పెరగడంతో సిద్దవటేశ్వర, నీలకంఠేశ్వర, సిద్దేశ్వర శివాలయాలు శివనామస్మరణతో హోరెత్తాయి.

ఒంటిమిట్ట: కార్తీక మాసం పౌర్ణమి కావడంతో బుధవారం శివాలయాలు కిటకిటలాడాయి. ప్రధానంగా కొత్తమాధవరం సమీపంలో ఉన్న మృకుండాశ్రమం భక్తులతో నిండిపోయింది. వేకువజామునే ఆలయ అర్చకులు చంద్రశేఖర్ స్వామివారికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఓబులవారిపల్లె: మండల పరిధిలోని బొమ్మవరం గ్రామంలో వెలసిన పర్వతివర్దిని సమేత రామలింగేశ్వరస్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. సాయంత్రం మహిళలు వెయ్యి దీపాలను వెలిగించి శివునికి పూజలు నిర్వహించారు.



రాయచోటి వీరభద్రాలయంలో గుగ్గిలం పూజలో పాల్గొన్న కన్నడ భక్తులు

ఘనంగా కామాక్షి, త్రేతేశ్వరస్వామి కల్యాణోత్సవం

రాజంపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన హత్యరాలలో కార్తీక పౌర్ణమి సందర్భంగా కామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శాస్త్రోక్తంగా వేదపండితులు వేదమంత్రోచ్ఛరణల మధ్య సంప్రదాయ రీతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అభిషేక, పూజలు నిర్వహించారు. కాగా కార్యక్రమానికి హాజరైన రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్ రాజుకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు. కార్యక్రమంలో హత్యరాల చైర్మన్ పూల నాగమణి, కార్యనిర్వాహకులు నరసింహులు, కోవూరు సుబ్రహ్మణ్యం నాయుడు, మేడికొండ రవికుమార్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్ఠ

● ప్రత్యేక పూజలు చేసిన చమర్తి, మల్లెల



జగన్‌మోహన్‌రాజును సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

సుండుపల్లె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముడుంపాడు పంచాయతీ తొగురుపల్లె సమీపంలోని పింఛా నది ఒడ్డున నూతనంగా నిర్మించిన శివాలయంలో బుధవారం మల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. ధ్వజస్తంభం వద్ద టీడీపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు మల్లెల శ్రీవాణి కుటుంబీకులు పూజలు చేశారు. అనంతరం ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ చమర్తి జగన్‌మోహన్‌రాజు మల్లికార్జునస్వామి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ దేవాలయాల నిర్మాణం వలన ప్రజల్లో భక్తిభావం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో భానుమూర్తి శర్మ, టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్ప, మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరాం నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ మోహన్‌బాబు, నాయుడు, జనసేన మహిళా నాయకురాలు రెడ్డిరాణి, ఆలయ చైర్మన్, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఐటీడీపీ అధ్యక్షుల ఎంపిక



మంత్రిని సన్మానిస్తున్న ఐటీడీపీ నాయకులు

రామాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఐటీడీపీ రాయచోటి నియోజకవర్గ టీడీపీ అసెంబ్లీ అధ్యక్షునిగా మండలంలోని రాచపల్లి గ్రామం బాలిరెడ్డిగారిపల్లెకు చెందిన వంగిమళ్ల నాగభూషణరెడ్డి, అలాగే మండల ఐటీడీపీ అధ్యక్షునిగా చిట్లూరు పంచాయతీ పాలన్నగారిపల్లెకు చెందిన మద్దకాయల గణేశులు ఎంపికయ్యారు. కాగా వీరు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌బాబు, మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, టీడీపీ యువనాయకుడు మౌర్యరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బుధవారం మంత్రి రాంప్రసాద్‌రెడ్డి స్వగృహంలో వారు మర్యాదపూర్వకంగా కలిశారు.

రేపటి నుంచి బేస్‌బాల్ ఎంపిక పోటీలు

రైల్వేకోడూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, హైస్కూలు మైదానంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి 9 వరకు ఉమ్మడి జిల్లాల క్రీడాకారులకు అండర్-19 విభాగంలో బేస్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎస్‌జీఎఫ్ అధ్యక్షుడు ఎన్‌వీ వెంకటేశ్వర్లు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.యశోదర, కార్యదర్శి చంద్రమోహన్‌రాజులు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన బేస్‌బాల్ క్రీడాకారులు 400 మంది ఈ పోటీలకు హాజరుకానున్నారని, పోటీలు పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. ఇందుకు మైదానాన్ని చదును చేయించామని తెలిపారు. పోటీల్లో క్రీడాకారులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు.

గ్రామదేవతలకు అభిషేకం, పూజలు

సుండుపల్లె, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీ మిట్టబిడికి సమీపంలో కుడికాలువ గట్టుపై వెలిసిన మారెమ్మ తల్లి, కాళికాదేవిలకు ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు గ్రామస్థులు తెలిపారు. బుధవారం ఉదయం నుంచి ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించినట్లు తెలిపారు. అనంతరం మారెమ్మ తల్లి కాళికాదేవిలకు అభిషేకం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అలాగే ఆలయ ప్రాంగణంలోని సేవాలాల్ మహారాజుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు ఉన్న భక్తులు టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ఓటును అమ్ముకోవద్దు

రైల్వేకోడూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఓటు వజ్రాయుధం అని.. ఆ ఓటును అమ్ముకోవద్దని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జి.రమేష్ తెలిపారు. బుధవారం రైల్వేకోడూరు డిగ్రీ కళాశాలలో ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రైల్వేకోడూరు డిప్యూటీ తహసీల్దార్ గల్లా రమణ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటు నమోదు చేయించుకోవాలన్నారు. కళాశాల పొలిటికల్ సైన్సు అధ్యాపకుడు జి.శ్రీనివాసులు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ దాసరి మోషే, చరిత్ర అధ్యాపకుడు డి.వెంకటేశ్వర్లు, కే.బుడుగుంటపల్లె వీఆర్‌వో, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం



నందలూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లెలోని శ్రీకృష్ణ గీతామందిరం నుంచి బస్టాండు కూడలి వరకు బుధవారం రాత్రి అయ్యప్పస్వామి గ్రామోత్సవం అత్యంత ఘనంగా జరిగింది. యాదవ సంఘం నాయకులు కుర్రా మణి ఆధ్వర్యంలో నూతన రథాన్ని ఆవిష్కరించి అదే రథంలో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి, నాగిరెడ్డిపల్లె సర్పంచ్ జంబు సూర్యనారాయణ పాల్గొని పూజలు నిర్వహించారు.

కోటి సంతకాల సేకరణ

పెనగలూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యం ప్రజారోగ్యం కార్యక్రమంలో భాగంగా వైసీపీ తలపెట్టిన కోటి సంతకాల కార్యక్రమం బుధవారం సాయంత్రం సింగనమలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ వలంటీర్ల సంఘం అధ్యక్షుడు పుచ్చకాయల శివశంకర్, మాజీ జడ్పీటీసీ నరసింహులు, ముదిరాజ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గుండ్లూరు ఈశ్వరయ్య, మండల నాయకులు జి.శివకుమార్, జి.మల్లికార్జున, శంకరయ్య పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారణ భక్తులకు బిక్ష

సుండుపల్లె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విరూపాక్ష చెన్నకేశవస్వామి ఆలయంలో బుధవారం 400 మంది అయ్యప్ప మాలధారణ భక్తులకు హరినాథరెడ్డి విద్యాసంస్థల కరస్పాండెంట్ రామ సునీల్‌రెడ్డి భిక్ష ఏర్పాటు చేశారు. దీక్ష చేసే వారికి అన్నదానం చేయడం పుణ్యకార్యమని పలువురు భక్తులు తెలిపారు. అయ్యప్ప ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆశీర్వదించారు. అనంతరం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

సీసీ రోడ్డుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న రూపానంద రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే శ్రీధర్

చిట్వేలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిట్వేలి సింగనమల వీధి నుంచి గాజులవీధి జంక్షన్ వరకు రూ.42 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా రూపానందరెడ్డిలు బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో అన్ని పల్లెల్లో సిమెంటు రోడ్లు నిర్మించేందుకు కృషి చేస్తున్నామన్నారు. చిట్వేలిని ఒక మోడల్ టౌనుగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో ముక్కా సాయివికాస్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ వరలక్ష్మీ, గుత్తి నరసింహ, పాటూరు శ్రీనివాసులరెడ్డి, శివరాజు, నాగేశ్వరరావు, నరసింహ, కూటమి నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు



సుబ్బనరసయ్య, తదితరులను సత్కరించిన మార్కెట్ అధికారులు

రాజంపేట, నవంబరు 5 (ఆంధ్ర జ్యోతి): రాజంపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన గన్నే సుబ్బనరసయ్య నాయుడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కార్తీక పౌర్ణమి పండుగను పురస్కరించుకుని నూతన పాలకమండలి సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వీరిని మార్కెట్‌యార్డు అధికారులు శాలువాలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, పలువురు పాల్గొన్నారు.

మృతుల కుటుంబ సభ్యులకు ఓదార్పు

పెనగలూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నడిమిసిద్దవరం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు చేపల వేటకు వెళ్లి మృత్యువాతకు గురైన విషయం పాఠకులకు తెలిసిందే. బుధవారం గ్రామానికి చేరుకుని మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుల కుటుంబ సభ్యులను పార్టీపరంగాను, తమ కుటుంబం వ్యక్తిగతంగాను ఆదుకుంటామని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఒకే గ్రామంలో సమీప బంధువులు ఒకేసారి ఇద్దరు చనిపోవడం చాలా విచారకమని సానుభూతి వ్యక్తం చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వశాఖ 2025-26కు జాతీయ యువత, కౌమార అభివృద్ధి పథకం (ఎన్‌పీవైఏడీ) కింద ఆర్థిక సహాయం కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్ప్ సీఈవో విజయ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్‌జీవో దర్పన్ సంస్థలు మాత్రమే నవంబరు 30, 2025వ తేది లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

వాహనాలకు...

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): శారీరక విభిన్న ప్రతిభావంతులకు నియోజకవర్గానికి 10 చొప్పున మూడు చక్రాలు వాహనాలు మంజూరయ్యాయని వికలాంగుల సంక్షేమశాఖ ఏడీ కృష్ణకిశోర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు పంపాలన్నారు.

ఉలవలు పంపిణీ

రాయచోటి(నేతాజీసర్కిల్), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో గురువారం 80 శాతం సబ్సిడీతో ఉలవలు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి కిశోర్‌నాయక్ బుధవారం తెలిపారు. సంబేపల్లె మండలానికి 250 క్వింటాళ్ల ఉలవలు, 10 కేజీల ఉలవలు మంజూరయ్యాయన్నారు.

యల్లమ్మకు అభిషేకాలు

సుండుపల్లె, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): చెన్నంశెట్టిపల్లెలో నూతనంగా నిర్మించిన యల్లమ్మ తల్లి ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం ఉదయం నుంచి అమ్మవారి ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం గ్రామస్థులు అమ్మవారికి పూజలు నిర్వహించారు.

సుపరిపాలన అందించడమే ధ్యేయం



ప్రజాదర్బార్‌లో సమస్యలు వింటున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండంలోని తన స్వగ్రామం బోరెడ్డిగారిపల్లెలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు, అధికారుల నుంచి వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి తక్షణమే పలువురు అధికారులను ఆదేశించారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి: ఎంఈవో

సుండుపల్లె, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈవో రవీంద్రనాయక్ తెలిపారు. మండల కేంద్రంలోని హెడ్మాస్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన పిల్లలను దత్తత తీసుకోవాలని, బోధనతో పాటు పిల్లలకు మోటివేషన్ క్లాసులు చెప్పాలన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అమ్మనాయక్, ఆబీదుల్లా, జక్రియాబేగం, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ సిబ్బందికి శిక్షణ తరగతులు



శిక్షణలో పాల్గొన్న ఉపాధిహామీ సిబ్బంది

రాజంపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజంపేట క్లస్టర్ పరిధిలోని ఏడు మండలాల ఉపాధిహామీ సిబ్బందికి రాజంపేటలో బుధవారం శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధిహామీ సహాయ సంచాలకుడు ఎస్.మృత్యుంజయరావు, రిసోర్స్‌పర్సన్ నాగరాజు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యుక్త యాప్ ద్వారా పనులను గుర్తించి తద్వారా అభివృద్ధి కార్యక్రమాలను అందులో నమోదు చేయాల్సి ఉందన్నారు. దీనివల్ల మనం చేయబోయే పనుల వివరాలు పూర్తిస్థాయిలో తెలుస్తాయని, నాణ్యతతో కూడిన పనులు చేయడానికి వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట క్లస్టర్ పరిదిలోని రాజంపేట, ఓబులవారిపల్లె, పుల్లంపేట, కోడూరు, పెనగలూరు, చిట్వేలి ఉపాదిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి కార్తీక శోభ

ఒంటిమిట్ట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్టలోని నడివీధి గంగమ్మతల్లికి కార్తీక పౌర్ణమి శోభ సంతరించుకుంది. అమ్మవారి ఆలయం వద్ద మహిళలు బుధవారం భారీ సంఖ్యలో విచ్చేసి కార్తీక దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా మండల పురోహితులు మధుమూర్తి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఎల్లయ్య, సిగే భాస్కర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, వెంకటరమణ, సునీల్‌కుమార్, శ్రీనివాసులు, భక్తులు పాల్గొన్నారు.



గంగమ్మతల్లి ఆలయం వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు

రైల్వేకోడూరులో భారీ వర్షం



రైల్వేకోడూరు ఆర్టీసీ అప్రోచ్ రోడ్డు వద్ద జలమయమైన రోడ్డు

రైల్వేకోడూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ఉన్నపళంగా కురవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైల్వేకోడూరు పట్టణంలోని రైల్వేస్టేషన్ రూటు, ప్రధానదారిలో వర్షపు నీరు భారీ ఎత్తున ప్రవహించింది. వాహనాల రాకపోకలకు కొంత అంతరాయం ఏర్పడింది. వ్యాపార దుకాణాల్లోకి వర్షపు నీరు చేరడంతో వ్యాపారులు ఒకింత ఇబ్బందులకు గురయ్యారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికే శిబిరాలు: కలెక్టర్



వినతులను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

నందలూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకే జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్లలో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నామని కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో కలెక్టర్ ప్రజల నుంచి వివిధ రకాల అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించామని, జిల్లావ్యాప్తంగా మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో మూడు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామన్నారు. రాజంపేట, మదనపల్లె, రాయచోటి మూడు డివిజన్లలో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో రాజంపేట సబ్‌కలెక్టర్ భావన, తహసీల్దారు అమరేశ్వరి, ఎంపీడీవో కేఆర్‌ఎం ప్రసాద్, ఈవోఆర్డీ సునీల్‌కుమార్, మండలంలోని ఇతర శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

బియ్యం సకాలంలో తరలించాలి

● జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



బియ్యం గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

కలకడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్ ద్వారా ప్రజలకు పంపిణీ చేసే బియ్యం రేషన్ దుకాణాలకు సకాలంలో తరలించాలని జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన కలకడలోని సివిల్ సప్లయ్ గోడౌన్‌ను పరిశీలించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే బియ్యం నిల్వల గురించి ఆరా తీశారు. పంపిణీలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సీఎస్‌డీటీకి సూచించారు. గోడౌన్ అద్దె భవనంలో నిర్వహిస్తున్న దృష్ట్యా పక్కా భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఎంపిక చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేశ్వరిబాయి, సీఎస్‌డీటీ రమేష్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిపై యాసిడ్ దాడి

రాజంపేటటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హత్యరాల గ్రామంలో మన్యం రవిపై బుధవారం కొందరు యాసిడ్‌తో దాడిచేసి గాయపరిచారు. వివరాల్లోకి వెళితే... ప్రకాశం జిల్లా రాజుపూరి గ్రామానికి చెందిన మన్యం రవి ఆరేళ్ల క్రితం హత్యరాలకు చెందిన సుబ్బరత్న అనే అమ్మాయిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. అప్పటి నుంచి అతనిపై అమ్మాయి తరపు బంధువులు గతంలో రెండుసార్లు దాడి చేసినట్లు బాధితుడు తెలిపాడు. ఇందులో భాగంగానే ప్రస్తుతం కూడా తనపై వారే దాడి చేశారని ఆరోపిస్తున్నాడు. అయితే దాడి చేసిన వ్యక్తి హత్యరాల గ్రామానికి చెందిన వ్యక్తిగా చెబుతున్నాడు. కాగా బాధితుడు రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయంపై మన్నూరు సీఐ ప్రసాద్‌బాబు కేసు నమోదు చేసి ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. దాడి చేసిన వారిని గుర్తించాల్సి ఉందని ఆయన తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కుటుంబకలహాలతో మహిళ ఆత్మహత్యాయత్నం చేసుకుందని పోలీసులు తెలిపారు. పీటీఎం మండలం రంగసముద్రంలో చోటు చేసుకున్న సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాల మేరకు రంగసముద్రం వాసులు లక్ష్మీదేవి, ఈశ్వరప్ప కుమార్తె భార్గవిని రెండేళ్ల కిందట అనంతపురం జిల్లా కదిరి పట్టణానికి చెందిన సాయివినయ్‌కుమార్‌కు ఇచ్చి వివాహం చేశారు. భార్యాభర్తలు ఇద్దరు ఓ కోళ్లఫారంలో పనిచేస్తున్నారు. మూడు రోజుల కిందట కుటుంబ కలహాల కారణంగా భార్గవి పుట్టింటికి వచ్చింది. బుధవారం ఉదయం క్రిమిసంహారిణి తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం డాక్టర్లు తిరుపతికి రెఫర్ చేశారు. ఈ మేరకు పీటీఎం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వృద్ధుడిపై ఎలుగుబంటి దాడి

సిద్దవటం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చలమారెడ్డి కొట్టాల కు చెందిన గోపాలయ్య (75)పై ఎలుగుబంటి దా డి చేసింది. లంకమల్ల అ భయారణ్యం రిజర్వు ఫారెస్ట్ పరిధిలోని వన్నేశ్వరం వంక ప్రాంతానికి వెళ్లిన గోపాలయ్యపై అకస్మాత్తుగా ఎలుగుబంటి దాడి చేసింది. తల, కన్ను, చెవి, దవడ వద్ద తీవ్ర గాయాలయ్యాయి. దాని బారి నుంచి తప్పించుకుని గ్రామానికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని కడప రిమ్స్‌కు తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మేఘశ్రీ ఎంపిక



మేఘశ్రీ

పెద్దతిప్పసముద్రం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు పెద్దతిప్పసముద్రం మండలం కాట్నగల్లు వాసి మేఘశ్రీ ఎంపికైనట్లు మండల విద్యాశాఖాధికారులు నారాయణ, గౌస్‌పీర్ తెలిపారు.

ఈనెల 8, 9వ తేదీల్లో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి హైజంప్ పోటీల్లో పాల్గొననుంది. మేఘశ్రీ ములకలచెరువు బాలికల గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. వారం రోజులుగా మండల, నియోజకవర్గం, జిల్లాస్థాయిలో జరిగిన హైజంప్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి హైజంప్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన గురుకుల పాఠశాల విద్యార్థిని మేఘశ్రీని ఆ పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, అధికారులు అభినందించారు.

ఇంటి పన్ను వసూళ్లలో వెనుకబడ్డాం

● బకాయిలు రూ.17 కోట్లు.. వసూలైంది రూ.17 లక్షలు

● డీపీవో రాధమ్మ



పీలేరు పంచాయతీ కార్యాలయంలో మాట్లాడుతున్న డీపీవో రాధమ్మ

పీలేరు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్ను వసూళ్లలో వెనుకబడ్డామని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) రాధమ్మ తెలిపారు. బుధవారం ఆమె పీలేరు పంచాయతీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ట్యాక్స్ వసూళ్లలో వేగం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఇకపై పన్ను ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చన్నారు. ఇంటి యజమాని ఫోన్‌కు మెసేజ్ వస్తుందని, అందుకు అనుగుణంగా ట్యాక్స్ చెల్లించవచ్చని ఆమె చెప్పారు. పన్ను వసూళ్లలో జిల్లా టార్గెట్ రూ.14.96 కోట్లని, గత ఏడాది అరియర్స్‌తో రూ. 2.67 కోట్లు ఉందన్నారు. మార్చి 31 నాటికి జిల్లాలో అరియర్స్‌తో కలిపి రూ.17.63 కోట్లు వసూలు చేయాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు కేవలం జిల్లాలో రూ.17 లక్షలు మాత్రమే వసూలు చేసినట్లు ఆమె తెలిపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్య ధోరణి అవలంభించరాదని, కష్టం తెలియకుండా ఉద్యోగం చేయాలంటే కుదరదని హెచ్చరించారు. చాలా మందిలో భయంలేనితనం ఉందని, దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఇంటి ముందే ఉద్యోగం చేయడమే ప్రధాన కారణమన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తే బదిలీలు తప్పవని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా శానిటేషన్‌పై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, అంటురోగాలు ప్రబలకుండా పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో ముందుకు పోవాలని సూచించారు. పీలేరులోని మినరల్ వాటర్ ప్లాంట్లలో పనిచేస్తున్న వర్కర్ల పెండింగ్ జీతాలు చెల్లిస్తామని తెలిపారు. పట్టణంలో పనిచేస్తున్న 26 మినరల్ వాటర్ ప్లాంట్లలో పనిచేస్తున్న వర్కర్లకు నెలకు రూ.6 వేలు చొప్పున 14 నెలలు జీతాలు చెల్లించాల్సి ఉందని, దీనిపై కలెక్టర్‌తో సంప్రదించి వీలైనంత త్వరగా పెండింగ్ జీతాలు ఇప్పిస్తామని ఆమె చెప్పారు. పెండింగ్ జీతాలు చెల్లించిన అనంతరం ప్రస్తుతం పనిచేస్తున్న వర్కర్లను తొలగించి వారి స్థానంలో పంచాయతీ వర్కర్లనే నియమించి పట్టణ ప్రజలకు తాగునీరు అందిస్తామని తెలిపారు. సమావేశంలో ఈవో బ్రహ్మానందరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల్లో వసతులు కల్పించాలి

● ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరాజు



మోడల్ స్కూల్ తరగతి గదుల్లో వసతులను పరిశీలిస్తున్న అధికారులు

తంబళ్లపల్లె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): టెన్త్ పబ్లిక్ పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు తప్పనిసరిగా కల్పించాలని ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ కొండూరు శ్రీనివాసరాజు ఆదేశించారు. పాఠశాల విద్యా కమిషనర్ విజయరామరాజు ఆదేశాల మేరకు బుధవారం ఆయన ఎంఈవోలతో కలిసి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్ టెన్త్ పరీక్షా కేంద్రాల్లో వసతులను పరిశీలించారు. కేంద్రాల్లో తరగతి గదులు, డెస్కులు, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులను పరిశీలించారు. పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు సమగ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంఈవోలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, హెచ్‌ఎంలు హేమంత్‌కుమార్, శ్రీనివాసులు, సూపరింటెండెంట్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

12మంది బైండోవర్

నిమ్మనపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండ్లపై పంచాయతీ భూమలగడ్డ గ్రామంలోని ప్రభుత్వ భూమి ఆక్రమణలో 12 మందిని తహసీల్దార్ తపస్విని ఎదుట బైండోవర్ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ భూమలగడ్డ గ్రామం సర్వే నెంబరు, 28-5లో ఉన్న 6 ఎకరాల 70 సెంట్ల ప్రభుత్వ భూమిని ఎలాంటి అనుమతులు లేకుండా ఆదే గ్రామానికి చెందిన 12 మంది ఆక్రమించుకుని చదును చేస్తుండగా అడ్డుకుని కంచె ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కాగా మాజీ సైనికుల్లో కొందరికి ఇదే స్థలంలో చెట్ల పెంపకానికి టూసీ పట్టాలు ఇచ్చినట్లు మాజీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులునాయుడు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రాంప్రసాద్, వీఆర్‌ఓ క్రిష్ణప్ప, పోలీసులు పాల్గొన్నారు.

వల్లభాయ్ పటేల్ ఆశయాలను కొనసాగిద్దాం

● రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



ఐక్యతా దివస్ ర్యాలీలో పాల్గొన్న మంత్రి మండిపల్లి, కూటమి నాయకులు

రాయచోటిటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలను కొనసాగిద్దామని మంత్రి మండపల్లి రాంప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఆయన రాయచోటి పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జాతీయ ఐక్యతా దివస్ కార్యక్రమంలో కూటమి నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2014లో భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఐక్యతా దివస్ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. మన దేశానికి ఉక్కు మనిషిగా పేరుగాంచిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ప్రతి ఏడాది ఐక్యతా దివస్ కార్యక్రమాన్ని జరుపుతారన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో కీలక పాత్ర పోషించిన వల్లభాయ్ పటేల్ స్వాతంత్ర్యం అనంతరం కూడా దేశ సేవ కోసం తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. అలాంటి మహోన్నత వ్యక్తి ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేశ్‌నాయుడు, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ పాలగిరి శ్రీనివాస్‌కుమార్‌రాజు, జిల్లా కార్యదర్శి ఆనందగజపతిరాజు, సీనియర్ నాయకులు అరమాటి శివగంగిరెడ్డి, బీజేపీ నాయకులు జానం బాలాజీ యాదవ్, రాజశేఖర్‌రెడ్డి, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించండి



సమావేశంలో మాట్లాడుతున్న వాసునూరి చంద్రశేఖర్

కలికిరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): త్వరలో ప్రారంభం కానున్న ప్రతిష్టాత్మక ఆదరణ 3.0 పథకాన్ని శాస్త్రీయ పద్ధతుల్లో అమలు చేయాలని, వివిధ బీసీ కులాల వారికి వారి జనాభా ప్రాతిపదికన దామాషా మేరకు నిధులు కేటాయించాలని రాష్ట జంగమ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వాసునూరి చంద్రశేఖర్ స్పష్టం చేశారు. రూ.వేయి కోట్లతో అమలు చేయనున్న ఆదరణ 3.0 పథకం విధివిధానాల కోసం బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత బుధవారం రాజధానిలో వివిధ బీసీ కార్పొరేషన్ల చైర్మన్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాత కులవృత్తులు మనుగడ కోల్పోయి ఆధునిక వృత్తులైన ఎలక్ట్రికల్ కుట్టు మిషన్‌లు, జిగ్‌జాగ్, ఎంబ్రాయిడరీ మిషన్లను ఉపయోగించడంలో మహిళలు తర్ఫీదు పొందారని మరి కొందరికి వాషింగ్ మిషన్లు, ఎలెక్ట్రికల్ ఐరన్ బాక్సులు అందజేయాలని చంద్రశేఖర్ సూచించారు.

ప్రధానంగా జంగం కులస్తులకు ప్రభుత్వం ప్రకటించిన 100 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అన్ని జిల్లాల్లో అమలు చేయాలని కోరారు. గతంలో రూ.30 వేల వంతున ఇస్తున్న ఆర్థిక చేయూతను రూ.లక్షకు పెంచాలని చెప్పారు. కాగా బీసీ జనాభా వివరాలను కులాల వారీ కలెక్టర్ల నుంచి తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు చంద్రశేఖర్ తెలిపారు. బీసీ సంక్షేమ వసతి గృహాలను కార్పొరేషన్ చైర్మన్లు తరచూ తనిఖీ చేయాలని మంత్రి సూచించినట్లు చెప్పారు. కార్పొరేషన్ చైర్మన్లకు దేవాలయాల్లో ప్రొటోకాల్ పాటించేలా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసేందుకు మంత్రి హామీ ఇచ్చారు.

రెవెన్యూ డివిజన్ కేంద్రంగా పీలేరు?

● సీసీఎల్ఏకు ప్రతిపాదనలు పంపిన మంత్రివర్గ ఉపసంఘం



పీలేరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా పీలేరు ప్రాంత వాసులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పే అవకాశం కనిపిస్తోంది. అమరావతిలో బుధవారం జిల్లాల పునర్విభజనపై మంత్రివర్గ ఉపసంఘం భేటీ జరిగింది. ఈ సందర్భంగా పీలేరును రెవెన్యూ డివిజన్ కేంద్రం చేయాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ మేరకు సీసీఎల్ఏకు ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తోంది.

పీలేరు నియోజకవర్గంలో..: పీలేరు, కేవీపల్లె, కలకడ, గుర్రంకొండ, కలికిరి, వాల్మీకిపురం మండలాలు ఉన్నాయి. వీటిలో పీలేరు, కేవీపల్లె, కలకడ, గుర్రంకొండ మండలాలు రాయచోటి రెవెన్యూ డివిజన్‌లో, కలికిరి, వాల్మీకిపురం మండలాలు మదనపల్లె డివిజన్‌లో ఉన్నాయి. ఒక నియోజకవర్గంలోని అన్ని మండలాలు ఒకే రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండాలన్న ప్రభుత్వ అభిమతం మేరకు పీలేరు నియోజకవర్గంలోని ఆరు మండలాలను ఒకే రెవెన్యూ డివిజన్ పరిధిలోకి చేర్చే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం పుంగనూరు నియోజకవర్గంలో ఉంటూ చిత్తూరు రెవెన్యూ డివిజన్‌లో ఉన్న రొంపిచెర్ల, పులిచెర్ల మండలాలు, పలమనేరు డివిజన్‌లో ఉన్న సదుం, సోమల మండలాలను కూడా ప్రతిపాదిత పీలేరు రెవెన్యూ డివిజన్‌లో కలపాలన్న డిమాండ్లు ఉన్నాయి. దీంతో వీటిని కూడా కలిపి పీలేరును రెవెన్యూ డివిజన్ కేంద్రం చేయనున్నారని సమాచారం. పీలేరును రెవెన్యూ డివిజన్ చేస్తే.. పుంగనూరు, పీలేరు నియోజకవర్గాల్లోని మండలాల వారు చేరుకోవాలంటే డివిజన్ కేంద్రం కేవలం 30 కి.మీ దూరం మాత్రమే ఉంటుంది.

నీటమునిగిన ఆటో డ్రైవరు మృతి

పెనగలూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగరాజపురం గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లంపాడు గ్రామానికి చెందిన గండికోట వెంకటేశ్ (30) అనే ఆటో డ్రైవర్ బుధవారం సాయంత్రం నీటమునిగి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు... వెంకటేశ్ ఆటో తోలుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం కూడా పెనగలూరు బస్టాండు నుంచి ప్యాసింజర్లను ఆటోలో ఎక్కించుకుని కోడిచిన్నయగారిపల్లెలో దింపి ఆటోను పార్కింగ్ చేశాడు. మోకాటి లోతు చెయ్యేటిలో నడుచుకుంటూ పల్లంపాడుకు చేరుకున్నాడు. అనంతరం సాయంత్రం బహిర్భూమికి వెళ్లి గ్రామదేవత పల్లమ్మగుడి వెనుకాల గల చెయ్యేటిలో కాళ్లు, చేతులు శుభ్రం చేసుకునేందుకు నీటిఒడ్డుకు వెళ్లాడు.

కాళ్లు జారి ప్రమాదవశాత్తు నీటిలో పడ్డాడు. గమనించిన ఇద్దరు వ్యక్తులు వెంటనే గట్టిగా కేకలు వేయడంతో సమీపంలోని ప్రజలు, కుటుంబ సభ్యులు ఏటివద్దకు చేరుకుని నీటమునిగిన వెంకటేశ్‌ను బయటకు తెచ్చారు. వెంటనే 108 అంబులెన్స్ ద్వారా పెనగలూరు పీహెచ్‌సీకి తరలించారు. డ్యూటీ నర్సు శాంతి ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించారు. కాగా అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కాగా పెనగలూరు ఏఎస్ఐలు ఎ.రాముడు, మల్లికార్జున ఆసుపత్రికి వచ్చి వివరాలు సేకరించారు. మృతుడికి భార్య, మూడేళ్ల లోపు ఇద్దరు పిల్లలు, తల్లి ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామంలో సౌమ్యుడిగా పేరు తెచ్చుకున్న వెంకటేష్ అకాల మరణం పట్ల పల్లంపాడులో విషాదఛాయలు అలముకున్నాయి.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

అటవీ క్షేత్రాధికారి జయప్రసాదరావు



ఆలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం

పీలేరు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మొక్కల పెంపకంతో పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని పీలేరు రేంజ్ అటవీ క్షేత్రాధికారి జయప్రసాద్, ఎస్ఐ లోకేశ్ తెలిపారు. బుధవారం మద్దుగుండాల మల్లేశ్వరస్వామి ఆలయ ఆవరణలో కార్తీక వన సమారాధనలో భాగంగా మొక్కలు నాటిన వారు మాట్లాడుతూ రోజురోజుకు వాతావరణ కాలుష్యం పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విపత్కర పరిస్థితుల నుంచి బయటపడాలంటే విరివిగా మొక్కలు నాటి సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. లేదంటే భవిష్యత్ అంధకారమేనని తెలిపారు. మొక్కుబడిగా మొక్కలు నాటి వదిలేయడం వల్ల ఎటువంటి ఉపయోగం ఉండదని హెచ్చరించారు. వాతావరణ కాలుష్యం పెరిగిపోతున్న కారణంగా అతివృష్టి, అనావృష్టి వంటి సమస్యలు ఉత్పన్నమౌతున్నాయని వివరించారు. పర్యావరణ పరిరక్షణలో అందరినీ భాగస్వాములను చేయడం కోసం తరచూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో తలపుల మాజీ సర్పంచ్ అబ్బవరం అమరనాథరెడ్డి, హరిబాబు నాయుడు, తలపుల బీటు అధికారి శ్రీనివాసన్, వన సంరక్షణ సమితి, ఆలయ కమిటీ సభ్యులు లింగమ్మ, వెంకటరమణ, వెంకటయ్యనాయుడు, చెంగల్‌రాయులు, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

13న మెగా జాతీయ లోక్‌అదాలత్

వాల్మీకిపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టులో డిసెంబరు 13న జరగనున్న జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జడ్జి గురు అరవింద్ బుధవారొ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్షణికావేశంలో కేసులు పెట్టుకోవడం ద్వారా జీవితాలు దుర్భరం అవుతాయని, కేసులతో సతమతమవుతున్న కక్షిదారులకు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్‌అదాలత్ చక్కటి వేదిక అని తెలియజేశారు. సివిల్, క్రిమినల్, బ్యాంకుల రుణాలు, రాజీకాదగ్గ కేసులన్నింటినీ పరిష్కరిస్తారని కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోలీసులు, న్యాయవాదులు కూడా సహకరించి జతీయ మెగా లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం నాగలక్ష్మి

కురబలకోట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి క్రికెట్, వాలీబాల్ జట్టుకు అంగళ్లు జడ్పీహైస్కూల్ విద్యార్థులు నేత్ర, ఇమ్రాన్ ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం నాగవేణి తెలిపారు. కురబలకోట మండలం తెట్టు పంచాయతీ రిషివ్యాలీ వాసులు రాజేంద్రనాయుడు కుమార్తె నేత్ర, అంగళ్లుకు చెందిన మౌలాలి కుమారుడు ఇమ్రాన్ టెన్త్ చదువుతున్నారు. చిత్తూరులో జరిగిన అండర్-17 స్కూల్ గేమ్స్ పోటీల్లో సత్తా చాటి మహిళల క్రికెట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి జట్టుకు నేత్ర ఎంపికైంది. ఈమె ఎన్‌టీఆర్ జిల్లాలో జరిగే పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఇటీవల అంగళ్లలో జరిగిన అండర్-17 స్కూల్ గేమ్స్ పోటీల్లో ఇమ్రాన్ వాలీబాల్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యాడు. కాగా విద్యార్థి పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరులో ఈనెల 20 నుంచి 24 వరకు జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైన విద్యార్థులను ఎంఈవో ద్వారకనాథ్, హెచ్‌ఎం నాగలక్ష్మి, పీడీ రమేశ్ తదితరులు అభినందించారు.

వంద శాతం మార్కులు సాధించాలి

విద్యార్థులతో డ్వామా పీడీ వెంకటరత్నం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డ్వామా పీడీ వెంకటరత్నం

రామాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మార్చిలో జరగనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు వందశాతం మార్కులు సాధించాలని డ్వామా పీడీ వెంకటరత్నం అన్నారు. మండల పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో బుధవారం ఆయన 10వ తరగతి విద్యార్థులకు చదువు పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి మార్కులు సాధించి ఉన్నత స్థాయికి వెళ్లినప్పుడే అటు తల్లిదండ్రులకు, చదువు చెప్పిన గురువులకు మంచిపేరు వస్తుందన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు బానిస కాకుండా మంచిగా చదువుకోవాలన్నారు. విద్యార్థులు ప్రతిరోజు స్నానం చేసి పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని ఆయన అన్నారు. అనంతరం మెనూ ప్రకారంగా భోజనాలు అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రామకృష్ణుడు, కళాశాల ప్రిన్సిపాల్, ఏపీవో పెంచలయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.లక్ష సాయం

నారా లోకేశ్ ఆదేశాలతో ఆదుకున్న కట్టా దొరస్వామినాయుడు



ఆర్థికసాయం అందజేస్తున్న టీడీపీ యువ నేత కట్టా దొరస్వామినాయుడు

మదనపల్లె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): షమీవుల్లా కుమారుడు అయాన్ చికిత్స కోసం బుధవారం తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ యువనేత కట్టా దొరస్వామినాయుడు రూ.లక్ష అందజేశారు. మెట్లపై ఆడుకుంటూ బాలుడు కిందపడడంతో తీవ్ర అస్వస్థతకు గురై బెంగళూరులోని రెయిన్‌బో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

నిరుపేద కుటుంబం కావడంతో చికిత్స చేయించుకునేందుకు ఆర్థిక స్థోమత లేదని ఆదుకోవాలని బాలుడి తండ్రి షమీవుల్లా సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో మంత్రి నారా లోకేశ్ స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో కట్టా దొరస్వామినాయుడు మదనపల్లెలోని పార్టీ కార్యాలయంలో తన వంతు సాయంగా రూ.లక్షను సమీవుల్లా కుటుంబానికి అందజేశారు. కట్టా దొరస్వామినాయుడు మాట్లాడుతూ నిరుపేదలను ఆదుకునేందుకు టీడీపీ అండగా ఉంటుందన్నారు. బాలుడు పూర్తిగా కోలుకుని ఇంటికి వచ్చే వరకు టీడీపీ అండగా ఉంటుందన్నారు.

ఉద్యాన పంటలకు తెగుళ్లు

● మందులు పిచికారీ చేసినా అదుపు కాని పరిస్థితి ● దిగుబడి తగ్గుతుందని ఆందోళనలో రైతులు



బొబ్బడాల తెగులు సోకిన పసుపు పంట

రాజుపాలెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించే రైతన్నలను ఎడతెరిపి లేని వర్షాలు కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. లక్షల రూపాయలు వెచ్చించి సాగు చేసిన ఉద్యాన పంటలకు తెగుళ్ల సోకడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. పసుపులో బొబ్బడాల తెగులు, ఆకుతోటల్లో ఆకులు పసుపు వర్ణంలోకి మారడంతో రైతన్నలకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది.

రాజుపాలెం మండలంలోని టంగుటూరు, కొట్టాల, దువ్వూరు మండలంలోని కానగూడూరు, జిల్లెల్ల, భాకరాపేట తదితర గ్రామాల రైతులు దాదాపు 350 ఎకరాల పైబడి పసుపు పంట సాగు చేశారు. పంట ఊటపర్వం (కొమ్ములు సాగే) దశలో అధిక వర్షాలకు తేమ శాతం ఎక్కువై పంటలకు బొబ్బడాల తెగులు సోకింది. కార్తీక మాసంలో ఊట పర్వం మొదలై డిసెంబరు వరకు మంచి దిగుబడినిచ్చే తరుణంలో తెగుళ్ల సోకాయి. రైతులు మందులు పిచికారీ చేసినా అదుపు కావడం లేదు. కొమ్ముల్లో పురుగు ఏర్పడి, మొదటి దశలోనే కుళ్ల తెగులు పడిందని రైతులు తెలిపారు. ప్రభుత్వం కూడా దెబ్బతిన్న పంటలకు ఆర్థికసాయం అందించాలని కోరుతున్నారు. ఎకరాకు ఒకటిన్నర లక్ష పైబడి ఖర్చు వస్తుందని.. 30 క్వింటాళ్ల దిగుబడి వస్తే ఇప్పుడున్న రేటు ప్రకారం రూ.2.50 లక్షలు వస్తుందని.. ఈ తెగుళ్ల వల్ల దిగుబడి తగ్గుతుందని రైతులు వాపోతున్నారు.

భారీ పెట్టుబడులు పెట్టి కంటికి రెప్పలా కాపాడు కుంటున్న ఆకుతోటలు అధిక వర్షాలకు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆకులు వచ్చే తరుణంలో తమల పాకులు



పసుపు వర్ణం తిరిగిన ఆకుతోట

లేత ఆకుపచ్చగా ఉండాలని.. అలా కాకుండా పసుపు వర్ణం తిరగడం ద్వారా తీగ చనిపోవడంతో పాటు దిగుబడులు కూడా తగ్గుతాయని రైతులు సతమతమవుతున్నారు. ఇప్పటికైనా ఉద్యానశాఖాధికారులు పసుపు, ఆకుతోటలను పరిశీలించి తగు సూచనలు సలహాలు ఇవ్వాలని పలువురు రైతులు కోరుతున్నారు.

చింత తీరేనా..?



చింతలరేవుపల్లె

ములకలచెరువు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అది మారు మూల గ్రామం. ఊరి చుట్టూ కొండలు, గుట్టలే ఉన్నాయి. ఎంతో ప్రశాంతంగా ఉండే గ్రామంలో అలజడి మొదలైంది. ఏదో దుష్ట శక్తి తమ గ్రామంలోకి వచ్చిందని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. రాత్రయితే ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. ములకలచెరువు, తంబళ్లపల్లె మండలాల సరిహద్దులో ఉన్న దేవళచెరువు పంచాయతీ చింతలరేవుపల్లెలో 40 కుటుంబాలు నివాసముంటున్నాయి. గ్రామమంతా వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు. ఏడాది వ్యవధిలో గ్రామంలో నలుగురు చనిపోయారు. 10 గొర్రెలు కూడా చనిపోయాయి. దీంతో గ్రామస్థులు రాత్రి 7గంటలు అయిందంటే చాలు తలుపులు మూసుకుని ఇళ్లల్లోనే గడుపుతున్నారు. ఇటీవల బయటి నుంచి పండితులను పిలిపించి ఊరిని చూపించారు. ఆలయం వద్దే సమాధులు ఉండడంతో గ్రామానికి అరిష్టమైందని 20 రోజుల్లోగా శాంతి పూజలు చేయాలని వారు చెప్పడంతో మరింత హడలిపోతున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని గ్రామంలో నెలకొన్న భయాందోళన తొలగించాలని పలువురు కోరుతున్నారు. కాగా.. ఈ వ్యవహారంపై తంబళ్లపల్లె ఎస్‌ఐ ఉమామహేశ్వరరెడ్డిని, తహశీల్దార్ శ్రీనివాసులును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. ఈ విషయం తమ దృష్టికి రాలేదన్నారు.

శ్మశాన వాటిక లేక.... శవంతో నిరసన



భూమి యజమానితో మాట్లాడుతున్న తహసీల్దారు శివరామిరెడ్డి

కమలాపురం రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్ల అవుతున్నా ఇంకా కొన్ని గ్రామాలకు శ్మశానవాటిక లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈడిగపల్లెలో యాదవ సామాజిక వర్గానికి ఇప్పటికీ శ్మశాన వాటిక లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. గ్రామం సగం కొండాయనల్లె పంచాయతీ, మరో సగం గ్రామ పెద్దచెప్పలి పంచాయతీలోకి వస్తుంది. పెద్దచెప్పలి పంచాయతీలోని సుమారు 15 యాదవ కుటుబాల వారికి అంత్యక్రియలు చేసుకునేందుకు స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఊరి సమీపంలో సర్వే నెంబరు 5లో స్థలం ఉండడంతో అక్కడే అంత్యక్రియలు నిర్వహించే వారు. ఆ స్థలాన్ని ఓ నేత పట్టా చేయించుకుని పంటలు సాగు చేసుకుంటుండడంతో సమస్య తలెత్తింది. ఈ నేపథ్యంలో బుధవారం గ్రామానికి చెందిన వృద్ధురాలు నాగమ్మ మృతి చెందడంతో ఎక్కడా అంత్యక్రియలు చేసుకోనివ్వకపోవడంతో శవంతో యాదవ కులస్తులు నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న తహసీల్దారు శివరామిరెడ్డి సిబ్బందితో గ్రామానికి చేరుకుని వారితో మాట్లాడారు. స్పందించిన తహసీల్దారు ముందుగా ఇచ్చిన పట్టా స్థలం యజమానులతో మాట్లాడానని.. అక్కడ అంత్యక్రియలు చేసుకోవాలని చెప్పడంతో సాయంత్రం అంత్యక్రియలు పూర్తి చేశారు. త్వరలో శ్మశానవాటిక ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దారు చెప్పడంతో గ్రామస్తులు శాంతించారు.

మల్లన్న సేవలో మంత్రి సతీమణి హరిత

తంబళ్లపల్లె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్య క్షేత్రం మల్లయ్యకొండలో వెలసిన భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిని బుధవారం రవాణ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాదరెడ్డి సతీమణి హరిత దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సతీమణికి ఆలయ ఈఓ మునిరాజ, అర్చకులు ఈశ్వరప్ప స్వాగతం పలికి స్వామి వారి ప్రత్యేక దర్శనం చేయించారు. అనంతరం హరితమ్మ ఆలయం వద్ద కార్తీక దీపాలు వెలిగించి పౌర్ణమి పూజలు చేశారు. ఆమె వెంట టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి సిద్దమ్మ, ఉత్తమ్‌రెడ్డి, ఆలయ అధికారులు ఉన్నారు.



కార్తీక దీపం వెలిగిస్తున్న మంత్రి సతీమణి హరిత

భూ సమస్యలు పరిష్కరించడమే ధ్యేయం



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న సబ్ కలెక్టరు చల్లా కళ్యాణి

తంబళ్లపల్లె, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజలు, రైతుల భూ సమస్యలను పరిష్కరించడమే రెవెన్యూ సమస్యల పరిష్కార వేదిక ధ్యేయమని మదనపల్లె సబ్ కలెక్టరు చల్లా కళ్యాణి అన్నారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన రెవెన్యూ సమస్యల పరిష్కార వేదికలో సబ్ కలెక్టరు పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ శిబిరంలో సంయుక్త ఎల్‌పీఎం విభజన-40, పొజీషన్ సర్టిఫికెట్లు-22, మ్యుటేషన్లు లావాదేవీలు-11, మ్యుటేషన్ సవరణలు-7, జననం, మరణం ఆలస్య రిజిస్ట్రేషన్లు-20, కుటుంబ సభ్యుల ధృవపత్రాలు-6 మొత్తం 107 సేవలను ప్రజలకు అందించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి 14 అర్జీలను స్వీకరించినట్లు తెలిపారు. సబ్‌కలెక్టరు మాట్లాడుతూ.. ఇటువంటి శిబిరాల ద్వారా గ్రామాల్లో దీర్ఘకాలికంగా నెలకొన్న రెవెన్యూ, భూ సమస్యలను జిల్లా కార్యాలయానికి వెళ్లకుండానే మండల కేంద్రంలోనే పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. రైతుల నుంచి అందిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని తహసీల్దారు శ్రీనివాసులును ఆదేశించారు. కార్యక్రమంలో డీటీ నవీన్, వీఆర్వో నాగరాజు, సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్ఏలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పశువులకు సకాలంలో టీకాలు వేయించాలి

పెద్దతిప్పసముద్రం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పశువులకు సకాలంలో టీకాలు వేయించాలని మదనపల్లె పశు వైద్య ఉపసంచాలకులు శ్రీనివాసుల నాయుడు సూచించారు. బుధవారం రాష్ట్రీయ గోకుల పథకం కింద పశు సంవర్థక శాఖ, పశు గణాభివృద్ధి సంస్థ తిరుపతి ఆధ్వర్యంలో మండలంలోని బూర్లపల్లె, ఎస్‌కే పోతుపేట గ్రామంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. పొదుగు వాపు వ్యాధి, దూడల పెంపకం, పశువుల పెంపకంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియచేశారు. ఈ శిబిరంలో సుమారు 175 పశువులకు పిడుదుల మందు పిచికారీ, నట్టల నివారణ మందులు, మినరల్ మిక్చర్ పంపిణీ చేసినట్లు తెలిపారు. బురకాయలకోట సహాయ సంచాలకులు కళ్యాణ్, వెంకటేష్, పశువైద్యాధికారి నివేదిత, మాజీ జడ్పీటీసీ ఈశ్వరప్ప, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు



ప్రణవ్‌గోవర్ధన్, మణిదీప్, ముఖేష్ మోక్షజ్ఞ, హేమచందర్‌నాయక్

కడప స్పోర్ట్స్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ అండర్ 14 మెన్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లు బుధవారం డ్రాగా ముగిశాయి. వివారాలిలా........

కడప నగర రిమ్స్ సమీ ప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో నెల్లూరు- చిత్తూరు జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 51.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 184 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. ఓవర్ నైట్ స్కోర్‌తో బుధవారం బ్యాటింగ్‌కు దిగి 66.1 ఓవర్లలో 226 పరుగులకు ఆలౌట్ అయింది. అతనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 75 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 325 పరుగుల స్కోర్ వద్ద డిక్లేర్ చేసింది. దీంతో చిత్తూరు జట్టుకు 99 పరుగుల ఆధిక్యత లభించింది. ఇందులో ప్రణవ్‌గోవర్ధన్ 151 పరుగులు, మణిదీప్ 90 పరుగులు చేశారు. రెండో ఇన్నింగ్స్‌కు దిగిన నెల్లూరు జట్టు ఆట ముగిసే సమయానికి 4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 26 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసి నట్లు వెల్లడించారు.

కేఓఆర్ఎం మైదానంలో అనంతపురం-కర్నూలు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో మొదటిరోజు ఆట ముగిసే సమ యానికి 45 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 174 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. రెండో రోజు బుధవారం బ్యాటింగ్‌కు దిగి మొత్తం 72 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 268 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఇందులో మోక్షజ్ఞతేజ్ 138 పరుగులు, హేమచందర్ నాయక్ 113 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 72 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 189 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. మోక్షజ్ఞరెడ్డి 90 పరుగులు చేశారు. దీంతో అనంతపురం జట్టుకు 79 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి 7ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 13 పరుగులు చేసింది. దీంతో ఆట డ్రాగా ముగిసినట్లు వెల్లడించారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం : ఎమ్మెల్యే

మదనపల్లె అర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఆత్మరక్షణకు కరాటే ఒక భాగమని, ఇది నిత్య జీవితంలో ఆత్మరక్షణకు ఎంతో అవసరమని ఎమ్మెల్యే షాజహాన్‌బాష అన్నారు. బుధవారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పాఠశాల, కళాశాల విద్యార్థిని, విద్యార్థులకు సెల్ఫ్ డిఫెన్స్ కరాటే ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమంలో నేతలు కమలమరి కృష్ణ, క్రిష్టియన్ మైనార్టీ నేతలు జాన్‌బాబు. జేసీబీ వేణు, మధుసూదన రెడ్డి, పాఠశాల హెచ్ఎం సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సుజిత, రుచితకు గోల్డ్ మెడల్స్

అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులు



ప్రతిభ చాటిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

మదనపల్లె టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అంతర్ యూనివర్సిటీ అథ్లెటిక్ పోటీల్లో లాంగ్‌జంప్‌లో టి.సుజిత, పరుగుపందెంలో వి.రుచిత గోల్డ్‌మెడల్ సాధించారని కరెస్పాండెంట్ రాటకొండ గురుప్రసాద్ పేర్కొన్నారు. ఎస్వీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహించిన అంతర్ యూనివర్సిటీ అథ్లెటిక్ పోటీల్లో మదనపల్లె జ్ఞానాంబిక విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారన్నారు. అంతర్ యూనివర్సిటీ పోటీల్లో టి.సుజిత లాంగ్‌జంప్‌లో గోల్డ్ మెడల్, 100 మీటర్ల పరుగుపందెంలో వి.రుచిత గోల్డ్ మెడల్ సాధించిందన్నారు. 800, 1000 మీటర్ల రిలే పరుగు పందెంలో బి.కీర్తన రజత పతకం, జావెలిన్ త్రోలో కె.రుక్మిణి నాలుగు రజత పతకాలు, పురుషుల విభాగం జావెలిన్ త్రోలో మనోజ్ రజత పతకం, 110 మీటర్ల హర్డిల్స్‌లో పవన్‌కుమార్ రజత పతకం సాధించాడన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ రమాదేవి, పీడీలు శరత్ నాయక్, జగదీష్ అభినందించారు.

టీడీపీ అధ్యక్షుడిని కలిసిన పీటీఎం నేతలు

పెద్దతిప్పసముద్రం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులును పీటీఎం మండల టీడీపీ నేతలు కలిసి వినతి పత్రం అందజేశారు. కర్ణాటక సరిహద్దుగా ఉన్న పీటీఎం మండలంలోని టీ సదుం గ్రామంలో ప్రభుత్వ భూములను గుర్తించి ఇండస్ట్రియల్ కారిడార్‌గా ప్రకటించాలని కోరినట్లు తెలిపారు. బెంగళూరుకు 80 కిలోమీటర్లు దూరం ఉందని ఇక్కడ ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయని ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. యువ నాయకులు పట్టా చంద్రమోహన్‌రెడ్డి, అంకిరెడ్డి పల్లి రమేష్ రెడ్డి, రేకులకుంట పల్లి రాజారెడ్డి, అనంతపురం సుబ్బిరెడ్డి, ఆంజనేయరెడ్డి, వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

మల్లయ్యకొండలో సౌకర్యాలు కల్పించాలి

తంబళ్లపల్లె, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండ ఆలయానికి వచ్చే భక్తులకు కొండపైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా దేవదాయ శాఖ అధికారి విశ్వనాథన్ ఆదేశించారు. తంబళ్లపల్లె మల్లయ్యకొండను సందర్శించారు. తొలుత భ్రమరాంభిక సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కార్తీక మాసం పురస్కరించుకుని ఆలయంలో చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. గౌరీ నోములు నోచుకోవడానికి కొండకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా కళ్యాణ కట్ట వేదిక వద్ద ఏర్పాట్లు చేసి సౌకర్యాలు కల్పించాలని ఈఓను ఆదేశించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని స్వామి వారిని ప్రశాంతంగా దర్శించుకునేలా క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈఓ మునిరాజు, రికార్డు అసిస్టెంట్ కొండ కిట్ట, సిబ్బంది తదితరులు ఉన్నారు.

నేలమల్లేశ్వర అలయంలో రథోత్సవం



ఆలయంలో స్వామి వారి రథం లాగుతున్న భక్తులు

నిమ్మనపల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తవళం అటవీ ప్రాతంలో వెలసిన నేలమల్లేశ్వస్వామి ఆలయంలో బుధవారం రథోత్సవం, స్వామి వారి కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించినట్లు ఈఓ మంజుల తెలిపారు. కొత్తగా తయారు చేసిన రథంలో పూజలు నిర్వహించి సంప్రదాయ పద్దతిలో స్వామి వారిని ప్రతిష్టించి భక్తి శ్రద్దలతో ఆలయం చుట్టూ తిప్పారు. స్వామివారి రథం లాగేందుకు అధిక సంఖ్యలో మహిళా భక్తులు పోటీ పడ్డారు. అనంతరం స్వామి వారి కళ్యానోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో నోముల నోచుకుని లక్షదీపాలను వెలిగించారు. దీంతో అలయం మొత్తం దీపాల వెలుగులతో నిండిపోయింది. రాత్రి ఆలయం వద్ద నాటకాల ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెడ్డెప్పరెడ్డి అన్నదానం, తాగునీరు వంటివి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్థానికులు రాజన్న, రెడ్డిమొహన్ తదితరులు పాల్గొన్నారు.

పీలేరుకు చేయూతనివ్వండి

పీలేరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): 'స్వయం ప్రకాశితంగా అభివృద్ధి చెందిన పీలేరుకు ప్రభుత్వ పరంగా కాసింత చేయూతనివ్వండి. అక్కడ రెవెన్యూ డివిజన్ కేంద్రం ఏర్పాటు చేసి ప్రజల ఆకాంక్షలను నెరవేర్చండి' అంటూ మంత్రి నారా లోకేశ్‌కు పీలేరు రెవెన్యూ డివిజన్ సాధన సమితి నేతలు విజ్ఞప్తి చేశారు. పీలేరును రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ మంత్రి నారా లోకేశ్ విజయవాడలో సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వినతి పత్రం అందజేశారు. సమితి నేతలు సుధాకర్ బాబు, పాలకుంట శ్రీనివాసులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో సమితి సభ్యులు బద్దె భానుప్రకాశ్, తుమ్మల ధరణీ కుమార్, గుర్రం నారాయణ, దుబ్బా శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

తాగునీటి కోసం నిరసన



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

ములకలచెరువు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వర్షాలకు చెరువు నిండి తాగునీటి బోరు మట్టిలో కూరుకుపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడిందని, నెల రోజులుగా చెరువునీరే దిక్కుగా మారిందని ఉచ్చువారిపల్లె వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసనకు దిగారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ అధికంగా కురిసిన వర్షాలకు తిమ్మసముద్రం చెరువు నిండి సమీపంలోని తాగునీటి బోరు మట్టిలో కూరుకుపోయిందన్నారు. దీంతో నెల రోజులుగా తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. చేసేది లేక చెరువు నీటిని తెచ్చుకుంటున్నామన్నారు. విషయాన్ని ఎంపీడీఓ హరినారాయణ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పంచించి సమస్యను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామస్తులు రమణమ్మ, పద్మావతి, ఉత్తమ్మ, సావిత్రమ్మ, రామకృష్ణ, నారాయణ, కృష్ణప్ప, శివరాం, అంజి, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన పవిత్రోత్సవాలు



పూర్ణాహుతిలో భాగంగా నిర్వహిస్తున్న హోమాలు

చక్రాయపేట, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో నాలుగు రోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవాలు బుధవారం మహాపూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి. ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు కేసరి, ఉపప్రధాన అర్చకుడు రాజారమేష్ అధ్యక్షతన తిరుమల వేదపండితులు బీవీ రామానుజాచార్యులు, వేదపారాయణ పండి తుల బృందం రామ్మోహన్‌శర్మ హోమాలు నిర్వహించారు. పంచముఖ హనుమాన్ ఆంజనేయస్వామి మూలమంత్ర హోమం, సుదర్శన హోమం, పవిత్ర విసర్జనకుంభ విద్వాసన, మహాకుంభప్రోక్షణ, నివేదిన, శాత్తుమురై తదితర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పౌర్ణమి వెలుగులు

● భక్తిశ్రద్ధలతో కార్తీక దీపోత్సవం ● ఊరూవాడా మార్మోగిన శివనామస్మరణ ● గరుడ పుష్కరిణిలో విరజిమ్మిన కాంతులు


ప్రత్యేక అలంకరణలో కాశీవిశ్వేశ్వరుడు (పీలేరు)


కలకడ సిద్దేశ్వరాలయం, కలికిరి సోమేశ్వరాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు - పౌర్ణమి పూజలందుకుంటున్న అభయాంజనేయస్వామి (వాల్మీకిపురం)


ప్రత్యేక అలంకణలో లక్ష్మీకామేశ్వరస్వామి (వాల్మీకిపురం)

పీలేరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి అంటే మహిళలకు ఎంతో ప్రీతిపాత్రమైనది. పౌర్ణమి ఘడియల్లో వేకువనే లేచి శివాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేస్తారు. ముందే సమకూర్చుకున్న వత్తితో తయారు చేసిన వత్తిని నేతిలో నాన్పి ప్రమిదలో పెట్టి దీపం వెలిగించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా బుధవారం పీలేరు మండలంలోని ఆలయాల్లో ఆధ్మాత్మిక శోభ వెల్లివెరిసింది. ప్రత్యేక పూజల కోసం వేకువజాము నుంచి రాత్రి వరకు భక్తులు పెద్దఎత్తున తరలి రావడంతో ఆలయాలన్నీ కిటకిటలాడాయి. మండలంలోని ఆలయాల్లో ఆధ్మాత్మిక శోభ వెల్లివెరిసింది. పట్టణంలోని కాశీవిశ్వేశ్వర స్వామి, రౌద్రాల అంకాలమ్మ, చెన్నకేశవ స్వామి, పద్మావతి ఆండాళ్ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయాలు, జంగంపల్లె వీరభద్ర స్వామి, దొడ్డిపల్లె పంచాయతీ శివరామాపురంలోని భ్రమరాంబిక మల్లికార్జున స్వామి, అగ్రహారం అష్టలక్ష్మీ సమేత నరసింహస్వామి, మద్దుండాల మల్లేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు పోటెత్తారు. కాశీవిశ్వేశ్వర స్వామి, శివరామాపురంలోని భ్రమరాంబిక మల్లికార్జున స్వామి, అగ్రహారం అష్టలక్ష్మీ సమేత నరసింహస్వామి ఆలయాల్లో అర్చకులు మహిళలతో సామూహిక కేదార గౌరీ వ్రతాన్ని ఆచరింపజేశారు. అనంతరం ఆలయాల్లో మహిళలు పెద్దఎత్తున కార్తీక దీపారాధన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చాలా మంది అయ్యప్పస్వామి భక్తులు ఇరుముడి ధరించి శబరిమలైకు పయనమయ్యారు. బుధవారం సాయంత్రం వర్షం కురిసినా భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. ఆలయాల కమిటీ సభ్యులు పర్యవేక్షించగా అర్బన్ సీఐ యుగంధర్, ఎస్ఐలు లోకేశ్, రహీం సిబ్బందితో బందోబస్తు చేపట్టారు.


పీలేరు శివాలయంలో జ్వాలా తోరణం

దీపాల కాంతులతో గరుడ పుష్కరిణి

వాల్మీకిపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పౌర్ణమి వేడుకలు అశేష భక్తజనం నడుమ కనుల పండువగా సాగాయి. లక్ష్మీకామేశ్వరస్వామి ఆలయంలో ఉదయం మూలవర్లకు అభిషేకాలు, విశేషాలంకరణలతో ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం ఆలయంలో జ్వాలా తోరణం, ద్వారదర్శనం, ఆయుత దీపోత్సవం చేశారు. అశేష భక్తజనం కార్తీక దీపాలను వెలిగించారు. మహాగరుడ పుష్కరిణి, కార్తీక దీపాల వెలుగులతో శోభాయమానంగా కనిపించింది. ధర్మకర్త కువైట్ శంకరాచారి, అర్చకులు శీనాస్వామి, భక్తులు పాల్గొన్నారు.

వేడుకగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం సమూహాలయంలో షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఉదయం సామూహిక సత్యనారాయణ వ్రతం చేయించారు. సాయంత్రం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. పౌర్ణమి వెలుగులో కార్యసిద్ధి అభయాంజనేయస్వామికి ఆకుపూజ, సింధూర పూజ, వడమాల, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమాల్లో ట్రస్టు వ్యవస్థాపకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, అర్చకులు అభిరామ్‌స్వామి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

శివాలయాలకు పోటెత్తిన భక్తులు

తంబళ్లపల్లె, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా మండలంలోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. మల్లయ్యకొండ మల్లికార్జున స్వామి ఆలయం, మండల కేంద్రంలోని శివాలయం, పాపిరెడ్డిగారిపల్లె ఏటిగడ్డ సదాశివాలయం, కోసువారిపల్లె చంద్రమౌళీశ్వర స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మహిళలు ప్రత్యేక పూజలు చేసి కార్తీక దీపాలు వెలిగించి మొక్కుకున్నారు.

భక్తిశ్రద్ధలతో పౌర్ణమి వేడుకలు

గుర్రంకొండ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి వేడుకలను మహిళలు భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. సిద్దేశ్వరస్వామి ఆలయం, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, ఉమామహేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు దీపాలను వెలిగించారు.

ఝరి కోనలో లక్ష దీపోత్సవం

కలకడ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఝరి కోనలో లక్ష దీపోత్సవం శోభాయమానంగా నిర్వహించారు. కార్తీక పౌర్ణమిని ప్రజలు భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. స్థానిక కామాక్షీ సమేత సిద్ధేశ్వరాలయం, బాటవారిపల్లెలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం సహా పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఝరి, సిద్దేశ్వర ఆలయంలో అధిక సంఖ్యలో భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు.

సోమేశ్వరాలయంలో కార్తీక శోభ

కలికిరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా కలికిరి సోమేశ్వరస్వామి ఆలయంలో సహస్ర దీపారాధనతో ఆలయం వెలుగులు సంతరించుకుంది. బజారువీధి, మసీదు వీధులు జనసమ్మర్ధంతో గంటపాటు ట్రాఫిక్ స్థంభించింది. ఉదయం మహన్యాస రుద్రాభిషేకం, సాయంత్రం సహస్ర దీపాలంకరణ, ధ్వజస్తంభానికి కొత్తగా అమర్చిన కవచ సంప్రోక్షణ చేశారు. ఆలయంలోని మంటపాల వద్ద మహిళలు నేతి దీపాలను వెలిగించారు. జ్వాలా దర్శనం కోసం భక్తులు కిక్కిరిసి మోహరించారు. ఆలయ ధర్మకర్త పుల్లారెడ్డి ఏర్పాట్లను ఘనంగా చేశారు. అన్నప్రసాదాల వితరణ చేశారు. అర్చకులు రామచంద్ర శాస్త్రి, శివకుమార్ శాస్త్రి ప్రసాదాలు అందజేశారు.

పెద్దమండ్యంలో కార్తీక శోభ

పెద్దమండ్యం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో కార్తీకశోభ సంతరించుకుంది. మండలంలోని శివాలయాలన్నీ కార్తీక దీపాలతో వెలుగొంది. పెద్దమండ్యం శివాలయంలో అర్చకులు మణికంఠస్వామి ఆధ్వర్యంలో కార్తీక దీపరాధనలు, ప్రత్యేక పూజలు జరిగాయి.

భక్తులతో కిక్కిరిసిన శైవక్షేత్రాలు

మదనపల్లె అర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): శైవక్షేత్రాల్లో పౌర్ణమి దీపోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామివార్లకు అభిషేకాలు, అర్చనలు చేసి విశేషాలంకరణలతో భక్తులకు దర్శనం భాగ్యం కల్పించారు. చిప్పిలి గ్రామం మడికయ్యల శివాలయంలో యోగభోగేశ్వరుడిని మదనపల్లె డీఎస్పీ మహేంద్ర దర్శంచుకున్నారు. కమిటీ అధ్యక్షుడు కొప్పల వెంకటరమణ, సభ్యులతో కలిసి స్వామివారి సేవలో పాల్గొన్నారు. మహిళలు అధిక సంఖ్యలో కార్తీక దీపాలు వెలిగించారు. సీటీఎం కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి దీపోత్సవం నిర్వహించారు. చిప్పిలిలోని సత్యనారాయణ స్వామి ఆలయంలో పౌర్ణమి పూజలు కమిటీ అధ్యక్షుడు అమరనాథ్, సభ్యులతో కలిసి నిర్వహించారు. సాయంత్రం లక్షదీపోత్సవం చేశారు. నీరుగట్టువారిపల్లె, చౌడేశ్వరీ సర్కిల్‌లోని నీలకంఠేశ్వరుడిని ఆలయ ధర్మకర్త గుడి రామాంజనేయులు ఆధ్వర్యంలో పౌర్ణమి వేడుకలు చేశారు. మహిళలు ఆలయం ముందు దీపాలు వెలిగించారు. టూటౌన్ సీఐ రాజారెడ్డి ట్రాఫిక్‌ను మాయబజార్‌వీధికి మరలించారు. సీటీఎంరోడ్డులో మంజునాథస్వామి ఆలయంలో స్వామికి రుద్రాభిషేకం చేశారు. మహిళలు కార్తీక దీపోత్సవం చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. దేవళంవీధిలో సామేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు ఫణేంద్రస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో మహిళలు దీపారాధన చేశారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

పెద్దతిప్పసముద్రం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) ప్రస్న పార్వతి సమేత విరూపక్షేశ్వర స్వామి ఆలయంలో పౌర్ణమి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు. కార్యక్రమంలో కర్ణాటక రాష్ట్రం బెంగుళూరు చెందిన వేద పండితులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పిడుగుపాటు బాధితుడికి పరిహారం విడుదల

కలికిరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలం కొటాల గ్రామంలో పిడుగుపడి 37 గొర్రెలు మృతి చెందిన ఘటనలో బాధిత కుటుంబానికి పరిహారం విడుదల చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆగస్టు 9వ తేదీన కొటాల వాసి ఎం.రమేష్ గొర్రెలు మేపుతుండగా పిడుగుపడి 37 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. రమేష్‌కు పరిహారం చెల్లించాలని సెప్టెంబరు 7న కలెక్టరు పంపిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించింది. ఆ మేరకు బాధితునికి రూ.1,12,000లు పరిహారం మంజూరు చేసింది. కలెక్టరు వెంటనే ఈ నిధులను బాధితుడు రమేష్ బ్యాంకు ఖాతాలో నిధులు జమచేయాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

● టీడీపీ నేత కంభం నిరంజన్‌రెడ్డి


కూటమి నేతలతో మాట్లాడుతున్న కంభం నిరంజన్‌రెడ్డి

వాల్మీకిపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, నిరు పేదల సంక్షేమం సాధ్యమవుతోందని నియోజకవర్గ టీడీపీ సీనియర్ నేత, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో కూటమి నేతలతో సమావేశమైన ఆయన వివిధ గ్రామాల నుంచి సమస్యలపై వచ్చిన ప్రజలతో మాట్లాడి సంబంధిత అధికారులతో చర్చించి సమస్యలు పరిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అన్నీ కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వైసీపీ నేతలు గతంలో చేయకపోగా ప్రభుత్వం ద్వంద్వ వైఖరిని ప్రదర్శిస్తూ ప్రజలకు మభ్య పెడుతుండడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. సమావేశానికి హాజరైన నేతలందరినీ పలకరిస్తూ రాబోయే రోజుల్లో పార్టీలు బలోపేతానికి చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. సమావేశంలో మార్కెట్ ఛైర్మన్ కోసూరి చంద్రమౌళి, సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నేతలు పీవీ నారాయణ, రాజేంద్రాచారి, టీడీపీ మైనార్టీ నేత సయ్యద్‌బాషా, రామాంజులరెడ్డి, ఆదినారాయణ, మురళి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జనసేన ప్రభాకర్, కంభం దామోదర్‌రెడ్డి, అలి, గాంధీపేట రెడ్డి, తదితర నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న చల్లపల్లె నరసింహారెడ్డి

పెద్దమండ్యం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలం, గ్రామ స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలని రాష్ట్ర బీజేపీ సీనియర్ నేత చల్లపల్లె నరసింహారెడ్డి పిలుపు నిచ్చారు. పెద్దమండ్యం బ్రాహ్మణచెరువు చెరువుకట్టపై వెలసిన అంజనేయస్వామి గుడి వద్ద మండల బీజేపీ కార్యకర్తలతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో బూత్ కమిటీలు ఏర్పాటు చేసి ప్రతి నెలా సమావేశాలు జరపాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో దేశాభివృద్ధి సాధిస్తుందన్నారు. స్వదేశీ వస్తువులనే వినియోగించాలన్న ప్రధాని ఆకాంక్ష నేరవేర్చాలని కోరారు. మన రైతులు పండించే పండ్లు, పానీయాలు, ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. ఉపాధిలో అక్రమాలు నివారణకు కూలీలకు బయోమెట్రిక్ విధానం వచ్చిందన్నారు. వ్యవసాయానికి అనుసంధాన కార్యక్రమం కేంద్ర పరిశీలనలో ఉన్నట్లు తెలిపారు. మండల బీజేపీ అధ్యక్షుడు ముత్యాల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కార్యకర్తలు చల్లపల్లె, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మోహన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మండల బీజేపీ సీనియర్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏజీపీ రమణకు సన్మానం


ఏజీపీ రమణను సన్మానిస్తున్న నేతలు

వాల్మీకిపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఏజీపీగా నియమితులైన జూనియర్ కోర్టు న్యాయవాది రమణను పలువురు టీడీపీ నేతలు, సంఘాల నేతలు కోర్టు బార్ అసోసియేషన్ ప్రాంగణంలో కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో మాలమహానాడు నేతలు శివయ్య, బీసీ నేతలు సిద్ధప్ప, వాయల్పాడు రెడ్డెప్ప, బీవీ రమణ, నరసింహులు, సీవీ రమణ, రెడ్డెప్ప పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

కలకడ, గుర్రంకొండ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పౌరులు దేశ ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములు కావాలని బీజేపీ పీలేరు కన్వీనర్ పొత్తూరి శ్రీకాంత్ అన్నారు. బుధవారం కలకడలో పార్టీ శ్రేణులతో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ పాలనలో ఆత్మనిర్భర్ భారత్-వికసిత్ భారత్ లక్ష్యంతో ముందుకు వెళుతోందన్నారు. ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో స్వదేశీ వస్తువులను ఉపయోగించి దేశ ఉత్పాదక రంగానికి ఊతమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో నేతలు శ్రీనివాసులరెడ్డి, రామాంజులరెడ్డి, ఆంజనేయులు, చెన్నమనాయుడు, మణికం ఠ, శ్రీధర్, చంద్రశేఖర్‌రెడ్డి, గోపాల్, అమరనాథ్, వెంకటప్ప, మల్లికార్జున, బయ్యారెడ్డిలు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన మిట్స్ చాన్సెలర్ విజయభాస్కర్ చౌదరి



కురబలకోట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేష్‌ను డీమ్డ్ టు బీ మిట్స్ చాన్సెలర్ ఎన్.విజయంభాస్కర్ చౌదరి కలిశారు. అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు ఇటీవల డీమ్డ్ టు బీ మిట్స్ యూనిర్శిటీగా అవకాశం రావడంతో చాన్సెలర్ విజయవాడలో మంత్రిని కలిసి కళాశాలలో విద్యావిధానంను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. యూనివర్శిటీలో అందిస్తున్న ఉన్నత విద్య, డిజిటల్ ఆవిష్కరణలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో తమ యూనివర్శిటీ సాధించిన పలు అంశాలు నాణ్యమైన విద్య, అధ్యాపకుల మౌలిక సదుపాయాల గురించి తెలియజేశారు. దీంతో విజయభాస్కర్ చౌదరిని మంత్రి నారా లోకేష్ అభినందించారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన


కలిచెర్ల హైస్కూల్‌లో పరిశీలిస్తున్న శ్రీనివాసరాజు

పెద్దమండ్యం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) పెద్దమండ్యం, కలిచెర్ల టెన్త్ పరీక్ష కేంద్రాలను జిల్లా పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరాజు, సూపరింటెండెట్ రవి పరిశీలించారు. వారు మాట్లాడుతూ మార్చిలో టెన్త్ పరీక్షల నిర్వహణ కోసం పరీక్ష కేంద్రాలను పరిశీలించినట్లు తెలిపారు. పెద్దమండ్యం, కలిచెర్ల హైస్కూల్‌లో మౌలిక సదుపాయాలు పరిశీలించారు. ఎంఈఓ మనోహర్, ఎంపీడీఓ శ్రీధర్‌రావు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

చదువుతో పాటు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మదనపల్లె టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆరోగ్యంపై కూడా దృష్టి పెట్టాలని డాక్టర్ రామలింగారెడ్డి సూచించారు. స్థానిక ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కంటి పరీక్ష ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డిజిటల్ యుగంలో ఎక్కువ సేపు కంప్యూటర్, మొబైల్ స్క్రీన్ చూడటం వలన కంటి చూపు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. కంటి చూపు పట్ల అశ్రద్ద వహించకూడదని రామలింగారెడ్డి సూచించారు. 220 మందికి కంటి పరీక్షలు చేసి 50 మందికి శస్త్ర చికిత్స అవసరమని వైద్యులు సూచించారు.